Follow: @ANNTELUGU
01-05-2025
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 149 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సరిహద్దుల్లో యుద్ధమేఘాలు

### యుద్ధం ఖాయమంటున్న పాక్ మంత్రులు

భారీగా పాక్ సైన్యం రాజీనామాలు.. మే 2న మోదీ కీలక ప్రకటన?

**మహా:** పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భారత్ తీసుకుంటున్న చర్యలకు పాకిస్తాన్ వణికిపోతోంది. ఏ సమయంలో ఏం జరుగుతుందో, భారత్ తమ మీద దాడి చేయడం ఖాయమని పాక్ మంత్రులు చెబుతున్నారు. భారతదేశం మరో 24 నుండి 36 గంటల్లో పాకిస్తాన్ మీద సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని.. తమకు రహస్య సమాచారం ఉందని పేర్కొంది.

వివరాలు 2లో

టాప్ న్యూస్

కాంగ్రెస్.. కులగణనకు
### వ్యతిరేకి
- దేశవ్యాప్తంగా కులగణన మోదీ సర్కార్ ఘనతే
- బండి సంజయ్



02

ఏపీ, తెలంగాణ అసెంబ్లీ
### సీట్ల పెంపు
- సుప్రీం న్యాయస్థానం తీర్పు రిజర్వు



02

పంజాబ్ సంచలన
### విజయం
- ఇంటి దారి పట్టిన ధోనీ సేన



08




# జనగణనలో కులగణన

### కేంద్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం.. మోదీ నిర్ణయంపై రాహుల్ హర్షం

### కులగణనలో తెలంగాణ రోల్ మోడల్.. : రాహుల్ గాంధీ ప్రశంసలు

**ఢిల్లీ, మహా:** దేశంలో కులగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే జనాభా లెక్కల్లోనే దీనిని చేర్చుతామని కేంద్రం ప్రకటించింది. కులగణన పేరుతో కాంగ్రెస్ సర్వే చేయించిందని, ఆయా రాష్ట్రాల్లో చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. నేడు కేంద్ర కేబినెట్ లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన వివరాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీపీఏ)ను సూపర్ కేబినెట్ గా వ్యవహరిస్తారు. నేడు జరిగిన భేటీలో కులగణనకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కులగణన అంశం కేంద్రం పరిధిలోకి వస్తున్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించాయన్నారు. ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాల వల్ల వాటిని చేపట్టారని విమర్శించారు. తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.

మిగతా 2లో





## ఏపీలో సీఎం రేవంత్ క్రేజ్
- దేవినేని కుమారుడి వివాహానికి హాజరు
- చూసేందుకు ఎగబడ్డ జనం.. సెన్సేషన్
- ప్రత్యేక ఆకర్షణగా సీఎం రేవంత్, మంత్రి లోకేష్

వివరాలు 3లో



## విశాఖ జిల్లాలో దారుణం
- సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశ్రుతి
- గోడకూలి ఏడుగురు భక్తులు మృతి

వివరాలు 3లో

# దేశానికి దిక్సూచి రేవంత్



### కులగణన ఛాంపియన్ తెలంగాణ సీఎం

### దేశానికి దారిచూపిన మార్గదర్శి

కేంద్రం నిర్ణయంపై రాహుల్ హర్షం.. సీఎం రేవంత్ పై ప్రశంసలు

ఇది తెలంగాణ ప్రభుత్వ విజయం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

రేవంత్ రెడ్డి కులగణన చేసి మార్గదర్శిగా నిలిచారు మాజీ ఎంపీ వీహెచ్

తెలంగాణ ప్రభుత్వ విజయం మంత్రులు సీతక్క, పొన్నం, కొండా సురేఖల హర్షం

దేశానికి దారిచూపిన సీఎం రేవంత్ రెడ్డి - కంది శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుచూపు.. కేంద్రానికి అనివార్యమైన పరిస్థితి తీసుకొచ్చింది. తాము తీసుకొచ్చిన బీసీ కులగణన అమలుచేయకుంటే కేంద్ర సర్కారుకు మరణశాసనమేని, తప్పకుండా చేయాల్సిన అనివార్యత కల్పించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన నిజమైంది. కళ్ళున్నోడు ముందుమాత్రమే చూస్తాడు.. దిమాక్ ఉన్నోడు దునియా అంతా చూస్తాడని ఓ సినిమాలో అన్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ దార్శనికతతో భవిష్యత్ ను దర్శించి చేసిన బీసీ కులగణన కేంద్రంపై ఒత్తిడిపెంచింది. రాహుల్ ఆశయానికి అనుగుణంగా ప్రత్యేకంగా డెడికేషన్ కమిటీ వేసి.. ఎంతో పెద్ద దనుకున్న సమస్యను చిక్కుల్లేకుండా సులువుగా పరిష్కరించి కేంద్రం మెడకు చుట్టిన రేవంత్ సాహసం చాణక్యంపై దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది.

మిగతా 2లో

### ఇది తెలంగాణ ప్రభుత్వ విజయం
### - టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

కులగణనపై కేంద్రం నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయమని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం జన గణన తో పాటు కుల గణన నిర్వహిస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమని, కులగణనతో తెలంగాణలో ఏ కులం వారు ఎంత నిష్పత్తిలో ఉన్నారని తేల్చి చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం నిర్ణయం తీసుకొని పారదర్శకంగా కుల గణన సర్వే నిర్వహించడం జరిగిందని, దేశ చరిత్రలో మొదటిసారిగా కుల గణన నిర్వహించిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. కులగణన చేపట్టాలనే రాహుల్ గాంధీ దీర్ఘకాలికంగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ప్రజల ఒత్తిడి మేరకు కులగణనకు ఒప్పకుందన్నారు.





## పదేళ్లు మాదే అధికారం

### ఫామ్‌హౌజ్‌లోనే కేసీఆర్ చరిత్ర పరిసమాప్తం

కేసీఆర్ మాటల్లో.. కళ్లలో విషం

తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా?

మరో పదేళ్లు దోచుకోవడం ఆగిందని తెలంగాణ ఆగమైందా?

పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేత?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజం

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో పదేళ్లు తామే అధికారంలో ఉంటాం....కేసీఆర్ పదేళ్లు ఫామ్ హౌజ్ లోనే ఉంటారు..ఆ తర్వాత ఆయన చరిత్ర అక్కడే పరిసమాప్తం అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ మాటల్లో, కళ్లలో విషం కనిపిస్తోందన్నారు. ఇటీవల ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

మిగతా 2లో

## టెన్త్‌లో 92.78 శాతం పాస్
- ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- మొదటి స్థానంలో బాలికలు
- 2 పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత
- ప్రైవేట్ స్కూళ్ళ కంటే గురుకులాల ఫలితాలే మెరుగు



వివరాలు 2లో

## ఇటు ధాన్యం కాంటా పూర్తి

### అటు రైతు ఖాతాల్లో డబ్బుల జమ.. ఎప్పటి కప్పుడు బోనస్ చెల్లింపు

అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కీలక ఆదేశాలు

**మహా :** రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి సేకరిస్తున్న సన్న ధాన్యం క్వింటాల్‌కు రూ. 500లు చొప్పున ఇస్తున్న బోనస్ చెల్లింపులు తక్షణమే చెల్లించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని పౌర సరఫరాల భవన్ నుంచి యాసంగి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో మంత్రి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

మిగతా 2లో



తెలంగాణా బోనాల జాతరకు
## ముహూర్తం ఫిక్స్
- గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మకు తొలిబోనం
- జూన్ 26 న గోల్కొండ బోనాలు
- జూలై 13 లష్కర్ బోనాలు
- జూలై 24 న పాతబస్తీ బోనాలు

03



జాతీయ భద్రతా సలహా బోర్డు
## పునరుద్ధరణ
- బోర్డు చైర్మన్‌గా రా మాజీ చీఫ్ అలోక్ జోషి నియామకం
- మరో ఏడుగురు సభ్యులకు చోటు

03



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | గురువారం, హైదరాబాద్ | 01-05-2025
ANN తెలుగు

# జనగణనలో కులగణన

## కేంద్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం..

### మోదీ నిర్ణయంపై రాహుల్ హర్షం

### కులగణనలో తెలంగాణ రోల్ మోడల్.. : రాహుల్ గాంధీ ప్రశంసలు

(మొదటిపేజీ తరువాయి)
ఏప్రిల్ 2020లోనే జనాభా లెక్కలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడిన విషయం తెలిసింది. భారత్‌పాకిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. గత రెండు రోజులుగా దిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో రక్షణమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధ దళాధిపతులతో సమావేశం జరిగింది. భద్రతపై కేబినెట్ కమిటీ, అనంతరం రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ జరిగింది.



# కులగణనలో తెలంగాణ రోల్ మోడల్

## రాహుల్ గాంధీ ప్రశంసలు

**ఢిల్లీ, మహా:** కేంద్రం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం చేసిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. దేశవ్యాప్తంగా కులగణన చేసేందుకు ఒప్పుకున్నందుకు ప్రధాని మోడీకి థాంక్స్ చెప్పారు. కేంద్రం ఏ కారణం చేత ఒప్పుకున్నా తమకు సంతోషమేనని అన్నారు. కులగణనలో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని స్పష్టం చేశారు. గతంలో బీహార్ రాష్ట్రంలో జరిగిన కులగణనకు తెలంగాణలో జరిగిన కులగణనకు చాలా తేడా ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో పారదర్శకంగా కులగణన జరిగిందని తెలిపారు. దేశంలో కులగణన ఎలా చేస్తారో చెప్పాలని కోరారు. బడ్జెట్‌లో కులగణన కోసం నిధులు కేటాయించాలని కేంద్రానికి సూచించారు. దేశ అభివృద్ధి కులగణనతోనే సాధ్యమని, ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు అవసరమని వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లు మోడీ సర్కార్ కులగణనపై నిర్లక్ష్యం వహించిందని అభిప్రాయపడ్డారు. కులగణనతో దేశ ఆర్థిక పరిస్థితి సైతం మెరుగుడుతుందని చెప్పారు. పహల్గామ్ ఉగ్రదాడిని దేశమంతా ఖండిస్తోందని కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మద్దతిస్తామని స్పష్టం చేశారు.

# దేశానికి దిక్సూచి రేవంత్



## కులగణన ఛాంపియన్ తెలంగాణ సీఎం

### దేశానికి దారిచూపిన మార్గదర్శి

కేంద్రం నిర్ణయంపై రాహుల్ హర్షం.. సీఎం రేవంత్ పై ప్రశంసలు

ఇది తెలంగాణ ప్రభుత్వ విజయం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

రేవంత్ రెడ్డి కులగణన చేసి మార్గదర్శిగా నిలిచారు మాజీ ఎంపీ వీహెచ్

తెలంగాణ ప్రభుత్వ విజయం మంత్రులు సీతక్క, పొన్నం, కొండా సురేఖల హర్షం

దేశానికి దారిచూపిన సీఎం రేవంత్ రెడ్డి - కంది శ్రీనివాసరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)
కేంద్రం జనగణనలో కులగణన చేర్చాలన్న నిర్ణయం తీసుకోవడంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. తెలంగాణలో బీసీ కుల గణనకు ఓ విధానం తీసుకురావడంతో పాటు ఇది దేశానికి రోల్ మోడల్ అవుతుందని సీఎం పలు సందర్భాల్లో చెప్పారు. రేవంత్ చెప్పినట్లుగానే జరిగిపోయింది. తెలంగాణ కులగణనలో రోల్ మోడల్ అని, తెలంగాణ బాటలో దేశం నడవాల్సిందేనని రాహుల్ గాంధీ చెప్పారు. కులగణనపై కేంద్రం నిర్ణయంతో దేశవ్యాప్తంగా తెలంగాణ సీఎం రేవంత్ గ్రాఫ్ పెరిగింది. ఇతర రాష్ట్రాల నుండి కూడా ఫోన్ల ద్వారా, మెసేజ్ ల ద్వారా అభినందనలు చెబుతున్నారు. పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

**రేవంత్ రెడ్డి ఘనతే - మాజీ ఎంపీ వీహెచ్**

జనగణన లో కులగణన చేస్తాం అని మోడీ ప్రభుత్వం క్యాబినెట్ లో ఒప్పుకుందని, రేవంత్ రెడ్డి భారత దేశానికి దిక్చుచి అని అప్పుడే చెప్పానని మాజీ ఎంపీ వీ. హనుమంతరావు అన్నారు. దేశంలో ఎవరు చేయకున్నా రేవంత్ రెడ్డి కులగణన చేసి మార్గదర్శిగా నిలిచాడని, క్రెడిట్ అంతా రేవంత్ రెడ్డికి, రాహుల్ గాంధీకి దక్కుతుందన్నారు. రాజకీయం చేస్తున్నారు అని మోడీ అంటున్నాడని, ఇప్పుడు మోడీ చేసింది రాజకీయం కాదా? అని ప్రశ్నించారు. అయోధ్యలో రాముడు చాలు అని మోడీ అనుకున్నాడని, బీసీలు 11ఏండ్లు కులగణన కోసం పోరాటం చేసిన ప్రతిఫలం దక్కిందని, తనకు చాలా సంతోషంగా ఉందన్నారు.

**వెంటనే కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలి - టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ**

గత పది సంవత్సరాలనుండి సమాజాన్ని ఎక్సరే లాగ కులగణన చేయాలని రాహుల్ గాంధీ చెప్పాడని, సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేసి కేంద్ర ప్రభుత్వానికి బిల్ పంపాడని టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేస్తామనడం రాహుల్ గాంధీ వ్యక్తిగత విజయమని, వెంటనే కేంద్ర ప్రభుత్వం దీనిని అమలు చేయాలన్నారు. రాష్ట్రాన్ని ఒక యూనిట్ గా చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**కేంద్ర కుల గణన ప్రకటనను స్వాగతించిన మంత్రి సీతక్క**

దేశవ్యాప్తంగా జనగణన తో పాటు కుల గణనను చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని మంత్రి సీతక్క స్వాగతించారు. పార్లమెంటు లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వారి ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం కుల గణన ప్రక్రియను పూర్తి చేయగా, ఇప్పుడు విధి లేని పరిస్థితుల్లో కేంద్రం దిగొచ్చి కుల గణన చేపడతామని ప్రకటించడం తెలంగాణ ప్రభుత్వ ముందు చూపునకు నిదర్శనం అని సీతక్క పేర్కొన్నారు. తెలంగాణలో కుల గణన చేపట్టడంతో ఇతర రాష్ట్రాల్లో, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిందని, ప్రజల డిమాండ్లకు తలొగ్గి తప్పనిసరి పరిస్థితుల్లోనే కేంద్ర ప్రభుత్వం కుల గణనకు అంగీకారం తెలపాల్సి వచ్చిందన్నారు.

**తెలంగాణ ప్రభుత్వ విజయం - మంత్రి పొన్నం ప్రభాకర్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కుల గణన రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరిగే చట్టం చేసి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసి పంపిందని, కేంద్ర ప్రభుత్వం బీసీ లకు తెలంగాణ లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేశామని, కుల గణన చేసి తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది తెలంగాణ ప్రభుత్వ విజయమన్నారు.

**దేశానికి దిక్సూచి నాడు బెంగాల్... నేడు తెలంగాణే మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు**

దేశానికి దిక్సూచిగా నాడు బెంగాల్ ఉంటే... నేడు తెలంగాణే అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సామాజిక దృక్పథం కలిగిన తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం కులగణనకు అంగీకారం తెలిపిందని ఆమె అన్నారు. ఇది తమ నాయకుడు రాహుల్ గాంధీ ఆశ, ఆశయమని... తమ రాష్ట్ర ప్రభుత్వ పెద్దల కృషి అని సురేఖ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం అంటూ సురేఖ వ్యాఖ్యానించారు.

### రాహుల్ విజన్.. రేవంత్ ఆచరణ..

## ఇది కాంగ్రెస్ విజయం

రాహుల్ గాంధీ విజన్, రేవంత్ రెడ్డి ఆచరణ కేంద్రాన్ని ప్రభావితం చేసి జనగణనలో కులగణన చేయాలన్న భారీ నిర్ణయానికి దారితీశాయని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. కులగణనపై కేంద్రం నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయమన్నారు. దేశంలో కులగణన చేసిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ అన్నారు. దేశవ్యాప్త కులగణనకు కారణమైన రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ తరుపున అభినందనలు తెలిపారు.



# సరిహద్దుల్లో యుద్ధమేఘాలు

## యుద్ధం ఖాయమంటున్న పాక్ మంత్రులు

### భారీగా పాక్ సైన్యం రాజీనామాలు..

### మే 2న మోదీ కీలక ప్రకటన?

(మొదటిపేజీ తరువాయి)
భారతదేశం తమపై దాడికి పాల్పడితే కనుక అందుకు తగిన పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సైతం హెచ్చరించింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైనిక అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం తర్వాత కొన్ని గంటలకు పాక్ ఇలాంటి ప్రకటనలు చేసింది. పహల్గాంలో గత వారం జరిగిన ఉగ్రవాద దాడికి ఎలా, ఎప్పుడు స్పందించాలో నిర్ణయించుకునే పూర్తి స్వాతంత్ర్యాన్ని సైన్యానికి ఇచ్చారు ఇచ్చారు ప్రధాని మోదీ. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు మే2న భారత ప్రధాని జాతినుద్దేశించి ప్రసంగించబోతున్నారని, అందులో పెద్ద నిర్ణయం ఉంటుందని విశ్లేషిస్తున్నారు. మరోవైపు యుద్ధ మేఘాలు అలుముకున్న నేపథ్యంలో పాక్ సైన్యం రాజీనామాల బాట పట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు 5వేల మందికి పైగా పాక్ సైనికులు రాజీనామాలు చేసినట్లు చెబుతున్నారు.

**బంకర్లలో తలదాచుకుంటూ..**

పహల్గాం దారుణ ఉగ్రదాడి తర్వాత భారతదేశం పొరుగు దేశం పాక్ మీద తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఈ దాడిలో అమాయకులైన 28మంది టూరిస్టులను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. ఆ తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత దిగజార్చాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోననే భయంతో సరిహద్దుల్లోని పాకిస్తాన్ ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. తమ ప్రాణాలను కాపాడుకునేందుకు వారు బంకర్లలో తలదాచుకుంటున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ బంకర్లలో ఆశ్రయం పొందుతున్నారు. ఇరు దేశాల మధ్య ఘర్షణలు జరిగితే తమకు ప్రాణ నష్టం వాటిల్లుతుందనే భయంతోనే వారు ఇలా చేస్తున్నామని చెబుతున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# టెన్త్ లో 92.78 శాతం పాస్

## ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి

### మొదటి స్థానంలో బాలికలు.. రెండు పాఠశాలల్లో జీరో ఉత్తీర్ణత

### ప్రైవేట్ స్కూళ్ళ కంటే గురుకులాల ఫలితాలే మెరుగు



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో 10వ తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. బుధవారం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఫలితాలను విడుదల చేశారు. ఫలితాల విడుదల కారక్యక్రమంలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరికొంత మంది మంత్రులు కూడా పాల్గొన్నారు. పరీక్ష ఫలితాల్లో 92.78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గురుకులాల్లో 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. గత ఏడాదితో పోలిస్తే 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదు అయ్యింది. ప్రతి ఏడాది మాదిరిగానే బాలురు 91.32 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 94.26 శాతం ఉత్తీర్ణత పొందారు. ఈ సారి కూడా బాలికలదే పైచేయిగా నిలవడం గమనార్హం. బాలికల కంటే బాలురు 2.94 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 4,629 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాగే రెండు పాఠశాలలు మాత్రం సున్నా శాతం ఫలితాలు పొందాయి. అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ప్రైవేటు పాఠశాలల్లో 94.21 శాతం విద్యార్థులు పాసయ్యారు. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లను ఎస్ఎస్‌సీ బోర్డు ఇచ్చింది. ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా 99.29 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా, వికారాబాద్ జిల్లా 73.97 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు తెలంగాణలో పదో తరగతి పరీక్షలు జరుగగా, దాదాపు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడం, మార్కుల మెమోలను ఎలా ఇవ్వాలన్న అంశంపై ఇప్పటికే అధికారులకు పూర్తిస్థాయి స్పష్టత రావడంతో ఈ పరీక్ష ఫలితాలు విడుదల చేశారు

**ఇకపై మార్కుల మెమోలు ఇలా..**

ఇంత వరకు పదో తరగతిలో సబ్జెక్టుల వారీగా గ్రేడ్లతో పాటు సీజీపీఏ ఇచ్చేవారు. కానీ ఇకపై సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్‌లు ఇవ్వనున్నారని విద్యా శాఖ అధికారులు వెల్లడించారు. మార్కుల మెమోలపైనా సబ్జెక్టుల వారీగా రాత పరీక్షలు, అంతర్గత పరీక్షల మార్కుతోపాటు మొత్తం మార్కులు, గ్రేడ్‌ను పొందుపరచనున్నారు. అలాగే, 20 ఇంటర్నల్ మార్కులకూ ఇంతవరకూ గ్రేడింగ్ విధానమే ఉండగా.. దీని స్థానంలో మార్కులు ప్రకటించనున్నారు. కొత్త మెమో నమూనాను పాఠశాల విద్యా శాఖ మంగళవారం విడుదల చేసింది. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు ఇస్తామని అందులో అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థి ఫలితాలను పాస్, ఫెయిల్ అని స్పష్టంగా పేర్కొననున్నారు. అయితే, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యా సంఘాలు ఎవరితోనూ సంప్రదించకుండా విద్యా శాఖ ఏకపక్షంగా, అనూహ్యంగా ఈ నిర్ణయం తీసుకుందనే విమర్శలు తీవ్ర స్థాయిలో వ్యక్తమవుతున్నాయి.

**జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు**

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15 వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం సబ్జెక్టుకు రూ. 500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుకు అవకాశం కల్పించారు.

# కేంద్ర నిర్ణయంతో రాహుల్ విజన్ సాకారం

### జనాభా లెక్కలతో కులగణన చేయాలన్న ప్రధాని నిర్ణయం అభినందనీయం

### రాహుల్ విపక్షంలో ఉండి కేంద్ర నిర్ణయాన్ని ప్రభావితం చేశారు

### దేశంలో కులగణన చేపట్టిన తొలి రాష్ట్రం తెలంగాణ: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** రాబోయే జనాభా లెక్కలతో పాటుగా కులగణన చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని, కేంద్ర కేబినెట్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర నిర్ణయంతో రాహుల్ గాంధీ విజన్ సాకారం కాబోతుందని సీఎం రేవంత్ తెలిపారు. రాహుల్ గాంధీ విపక్షంలో ఉండి కూడా కేంద్ర విధానాన్ని ప్రభావితం చేశారని రేవంత్ అన్నారు. దేశంలో కులగణన చేపట్టిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ విజన్‌తో తెలంగాణలో కులగనణ చేపట్టామన్న రేవంత్.. కులగణన కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాడిందని తెలిపారు. తెలంగాణ చేసింది దేశం అనుసరిస్తోందని మరోసారి రుజువైందని రేవంత్ తెలిపారు.

**రాహుల్ విజన్.. రేవంత్ ఆచరణ.. ఇది కాంగ్రెస్ విజయం**

రాహుల్ గాంధీ విజన్, రేవంత్ రెడ్డి ఆచరణ కేంద్రాన్ని ప్రభావితం చేసి జనగణనలో కులగణన చేయాలన్న భారీ నిర్ణయానికి దారితీశాయని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. కులగణనపై కేంద్రం నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయమన్నారు. దేశంలో కులగణన చేసిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ అన్నారు. దేశవ్యాప్త కులగణనకు కారణమైన రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ తరుపున అభినందనలు తెలిపారు.

## రాహుల్ గాంధీ కల ఇదే

భారత్ జోడో యాత్ర నిర్వహించిన రాహుల్ గాంధీ, కుల గణన అవసరాన్ని గుర్తించారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు కేంద్రం కూడా కులగణన చేసేందుకు అంగీకరించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేబినెట్ మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ కల కన్నది ఇదే. ఆయన కల నెరవేరడం చూసి తాము సంతోషంగా ఉన్నామని తెలిపారు.

# ఇటు ధాన్యం కాంటా పూర్తి

### అటు రైతు ఖాతాల్లో డబ్బుల జమ

### ఎప్పటి కప్పుడు బోనస్ చెల్లింపు

### అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కీలక ఆదేశాలు



(మొదటిపేజీ తరువాయి)
ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. ఈ ఏడాది యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖ రూపొందించిన విధి విధానాలను ఆ శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్, డైరెక్టర్ ప్రసాద్ వివరించారు. ఈ యాసంగి సీజన్‌లో 54.89 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగైన దృష్ట్యా 137.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి లభిస్తుందని పౌర సరఫరాల శాఖ అంచనా వేసింది. రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని 70.13 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించిన దృష్ట్యా సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో పెట్టినట్లు అధికారులు తెలియజేశారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు, వడగండ్ల వానలు, తీవ్ర గాలి దుమ్ముల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లకు మంత్రి మార్గనిర్దేశనం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం దిగుబడి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటి వరకు 8,381 వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. 202122 సంవత్సరం యాసంగితో పోల్చి చూస్తే, ఈ రబీ సీజన్‌లో అదనంగా 1,772 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లు సునిశితమైన అంశమైనందున జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎటువంటి అవాంతరాలు కలగకుండా చూసుకోవాలని సూచించారు. రానున్న 1520 రోజులు ధాన్యం కొనుగోళ్లు ఉద్ధృతంగా ఉంటాయని, ఆ సమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సాధారణంగా గోదాములు అందుబాటులో లేని ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం తరలించి ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు.

# పదేళ్లు మాదే అధికారం

(మొదటిపేజీ తరువాయి)
రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోతుల గుంపునకు అప్పగించినట్లయిందంటూ సీఎం ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత కుటుంబం తెలంగాణ మీద పడి దోచుకుందన్నారు. 'తెలంగాణ ఆగమైంది.. కాంగ్రెస్ విలన్' అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం తీవ్రంగా మండిపడ్డారు. మరో పదేళ్లు దోచుకోవడం ఆగిందని తెలంగాణ ఆగమైందా? తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రైతుబంధుపై చర్చిద్దామా? అంటూ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు కేసీఆర్ ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు.

**16 నెలలుగా ఫాంహౌస్‌లోనే ఎందుకు ఉంటున్నారు?**

"బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసుకుంటే బస్సులు ఇవ్వాలని చెప్పాం. సభకు అవసరమైన వెసులు బాటుకల్పించాలని అధికారులను ఆదేశించాం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలి. బీఆర్ఎస్ సభకు మేం సంపూర్ణంగా సహకరించింది నిజం కాదా? ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంలో ఎక్కడా మంచి కనబడటం లేదా? ప్రభుత్వాన్ని భుజం తడుతూ వైఫల్యాలను ప్రశ్నించాలి. మా వైఫల్యాలపై ఎండగట్టాలి.. కానీ, ప్రతిపక్ష నేత ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా ప్రభుత్వ వసతులు అనుభవిస్తున్నారు. 16 నెలలుగా జీత భత్యాలు తీసుకొని ఫాంహౌస్‌లోనే ఎందుకు ఉంటున్నారు?

**ఇవేవీ కనబడటం లేదా?**

అసెంబ్లీకి రాను.. మా పిల్లల్ని పంపామని చెబుతున్నారు. పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు? సభకు రాని ప్రతిపక్ష నేతకు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా? ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లడంలేదు. అధికారం ఉంటే చెలాయిస్తాం. లేకపోతే ఫాం హౌస్‌లో ఉంటామంటున్నారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. మీరు హయాంలోని పథకాలు ఏం ఆగిపోయాయి? రైతుబంధు ఆగిందా?, షాదీముబారక్, కల్యాణ లక్ష్మీ, ఫీజురియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ ఆగాయా? రాష్ట్రంలో ప్రజా పాలన ఎక్కడైనా ఆగిందా? మేం సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఇళ్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ప్రైవేటులో లక్ష ఉద్యోగాలు కల్పించాం. హైదరాబాద్‌ను విస్తరించేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఇవేమీ మీకు కనడటంలేదా?. కడుపు నిండా విషం నింపుకొని విద్వేషపూరిత ప్రసంగంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టాలనే ప్రయత్నం మంచిదికాదు" అన్నారు.



## భూదాన్ భూముల కేసులో సీనియర్ ఐపీఎస్‌లకు చుక్కెదురు..!



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భూదాన్ భూముల కేసుకు సంబంధించి సీనియర్ ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రాలకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఈ వివాదంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్ ను డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. తదుపరి వాదనలను సింగిల్ బెంచ్ ముందే వినిపించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం మండలంలోని సర్వే నెంబర్లు 181, 182, 194, 195లలో గల భూదాన్ భూములను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతరులు అక్రమంగా పొందారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ బిర్ల మల్లేశ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సి.వి. భాస్కర్ రెడ్డి నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఏప్రిల్ 24న కీలక ఆదేశాలు జారీ చేసింది. సదరు భూములను ఏప్రిల్ 27 నుంచి నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సంబంధిత సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఈ ఆదేశాలను సవాలు చేస్తూ మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రాలు హైకోర్టు డివిజన్ బెంచ్ ను ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ, మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నంబర్ 194లో ఉన్నది పట్టా భూమి అని, భూదాన్ భూమి కాదని కోర్టుకు తెలిపారు. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండానే సింగిల్ బెంచ్ ఏకపక్షంగా ఉత్తర్వులు ఇచ్చిందని వారు వాదించారు. పిటిషనర్ కోరిన దానికంటే ఎక్కువ ఉపశమనాన్ని సింగిల్ కల్పించిందని, బెంచ్ పిటిషన్ ను ఉపసంహరించుకోవద్దని రిజిస్ట్రీని ఆదేశించే అధికారం కూడా సింగిల్ బెంచ్ కు లేదని వారు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ప్రస్తుత దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి వాదనలను సింగిల్ బెంచ్ ముందే వినిపించాలని ఐపీఎస్ అధికారుల తరఫు న్యాయవాదులకు సూచించింది. దీంతో సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు ప్రస్తుతానికి అమల్లోనే ఉండనున్నాయి.

# వనపర్తిలో అభివృద్ధి నిధుల వరద

### రూ. 200కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం.. మేఘారెడ్డి పట్టుదలపై ప్రశంసలు

### ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**వనపర్తి, మహా:** వనపర్తి జిల్లాలో రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేశారు. వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి పట్టుదలతో నిధులు మంజూరు కాగా, బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి తో కలిసి రూ. 200 కోట్ల అభివృద్ధి పనులకు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వనపర్తి ప్రగతిని మలుపు తిప్పేలా మేఘారెడ్డి పనులు మంజూరుచేయించారు. వనపర్తి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో 2259 చదరపు గజాల్లో రూ. 8.50 కోట్లతో నిర్మించిన పి.జి విద్యార్థుల వసతి గృహాన్ని, 1002 చదరపు గజాల స్థలములో రూ. 4.00 కోట్లతో నిర్మించిన ప్రిన్సిపాల్, సిబ్బంది క్వార్టర్ భవనాలకు రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. మండల అభివృద్ధి అధికారి కార్యాలయ సముదాయంలో రూ. 7.50 లక్షలతో ఏ విధంగా ఒక ఇల్లు నిర్మించవచ్చో ఇందిరమ్మ ప్రదర్శన ఇంటిని ప్రారంభోత్సవం చేశారు. వనపర్తి నియోజక వర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లకు రూ. 182 కోట్లు మంజూరు చేశారు. అక్కడే రూ. 96 లక్షల వ్యయంతో నిర్మించే రేవల్లి, శ్రీరంగాపూర్, ఎదుల మండల తహసిల్దార్ కార్యాలయాల భవనాలకు శంఖుస్థాపన చేశారు ఎంపి మల్లు రవి నిధుల నుంచి (ఎంపీలాడ్) రూ. 1.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహ భవనానికి శంఖుస్థాపన చేశారు. రూ.2 కోట్ల తో యూనియన్ బ్యాంకు సహకారంతో చేపట్టే స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కే.డి.ఆర్. పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో ఉన్న పాత భావాన్ని రూ. 69 లక్షల ఖర్చుతో పునర్వ్యవస్థీకరణ చేసిన కళాశాల విద్యార్థుల బాలుర వసతి గృహాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. వనపర్తి జిల్లా ప్రజలు, పిల్లలు ఉదయం సాయంత్రం పూట ఆహ్లాదకరంగా గడపటానికి రూ. 55 లక్షల వ్యయంతో డా. బి.ఆర్. అంబేద్కర్ (నల్ల చెరువు) చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను ప్రారంభోత్సవం చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా మైనారిటీ మహిళల స్వయం ఉపాధి కొరకు 200 కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. రూ. 1లక్ష ఖర్చు తో విద్యార్థులకు వేసవి క్రీడ శిక్షణ శిబిరాలకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమం లో రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా . జి. చిన్న రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ,రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ భద్రతా సలహా బోర్డు పునరుద్ధరణ

### బోర్డు చైర్మన్‌గా రా మాజీ చీఫ్ అలోక్ జోషి నియామకం

### మరో ఏడుగురు సభ్యులకు చోటు



**మహా :** పహల్గామ్ దాడితో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాతున్న వేళ జాతీయ భద్రతా సలహా బోర్డును కేంద్రం పునరుద్ధరించింది. బోర్డు చైర్మన్‌గా రా మాజీ చీఫ్ అలోక్ జోషిని నియమించింది. ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ బోర్డులో విశ్రాంత మిలిటరీ, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఉన్నారు. బోర్డు సభ్యులుగా పీఎం సిన్హా, ఏకే సింగ్, మోంటీ ఖన్నా, మాజీ ఐఏఎస్ లు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి బీ వెంకటేశ్ వర్మలకు చోటు కల్పించింది. మరోవైపు పహల్గాం ఉగ్రవాద దాడి తరువాత ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో బుధవారం కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్), రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీపీఏ), ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశాలు జరిగాయి. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. బుధవారం రెండోసారి కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) సమావేశం జరిగింది. అంతకు ముందు ఏప్రిల్ 23న ఓసారి జరిగింది. జమ్మూకశ్మీర్ లో విజయంతంగా ఎన్నికలు నిర్వహించడం, అక్కడ అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, స్థిరమైన పురోగతిని ఓర్వలేకే ముష్కరులు పహల్గాంలో రెచ్చిపోయారని అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదానికి మద్దతు ఇస్తుందని, సింధూ జలాల ఒప్పందాల రద్దు సహా పలు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు.

# తెలంగాణా బోనాల జాతరకు ముహూర్తం ఫిక్స్

### గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మకు తొలిబోనం.. జూన్ 26 న గోల్కొండ బోనాలు

### జూలై 13 లష్కర్ బోనాలు.. జూలై 24 న పాతబస్తీ బోనాలు



**మహా :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే విశేషమైన పండుగలలో బోనాల పండుగ ఒకటి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో బోనాల పండుగను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎన్నో సంవత్సరాలుగా ఆషాడ మాసంలో బోనాల జాతరను నిర్వహించడం ప్రభుత్వ ఆనవాయితీగా వస్తుంది. ఇక ప్రస్తుతం 2025 సంవత్సరానికి సంబంధించి ఆషాడం బోనాల షెడ్యూల్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బోనాల పండుగ షెడ్యూల్ ఈ షెడ్యూల్ ప్రకారం బోనాల పండుగను నిర్వహించనున్నారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 26వ తేదీన గోల్కొండలో బోనాలు ప్రారంభమవుతాయి. అదే రోజున గోల్కొండ జగదాంబికా అమ్మవారికి తొలి బోనాన్ని సమర్పిస్తారు. ఇక అక్కడి నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బోనాలు ప్రారంభమవుతాయి. ఇక తెలంగాణ రాష్ట్రంలో చాలా ప్రత్యేకంగా చెప్పుకునే లష్కర్ బోనాలు జూలై 13 వ తేదీన ప్రారంభమవుతాయి. లష్కర్ బోనాలను రెండు రోజులపాటు నిర్వహిస్తారు. లష్కర్ బోనాలు ముగిసిన మరుసటి రోజు రంగం నిర్వహించే ఆనవాయితీ కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతుంది. ఇక జూలై 24వ తేదీన హైదరాబాద్ బోనాలు ముగుస్తాయని అధికారులు పేర్కొన్నారు. ఇక హైదరాబాద్ బోనాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. పోతరాజుల విన్యాసాలు, ఫలహారం బండ్ల ఊరేగింపులతో హైదరాబాద్ లో చాలా ఘనంగా ఆషాడం బోనాలు నిర్వహిస్తారు. ఈ బోనాల పండుగ సందర్భంగా మహంకాళిని పూజించి, గ్రామదేవతలకు నైవేద్యాలను సమర్పిస్తారు. ఒక్క హైదరాబాద్ లో మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో బోనాల జాతర జరుగుతుంది. మట్టికుండలో బోనాన్ని వండి అమ్మవారికి నివేదిస్తారు. భక్తిశ్రద్ధలతో మహంకాళి అమ్మవారిని పూజించి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, కరువు కాటకాలు లేకుండా ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ప్రార్థిస్తారు. గతంలో హైదరాబాద్ లో ప్రజలు ప్లేగు వ్యాధి బారిన పడినప్పుడు మహంకాళి దేవి కటాక్షంతో ప్రజలు ప్లేగు నుండి బయటపడ్డారు. అప్పట్నుంచి అమ్మవారికి కృతజ్ఞతగా బోనాలను సమర్పించి ప్రజలను చల్లగా చూడాలని ప్రార్థిస్తున్నారు. ఇక ఈ సంవత్సరం బోనాల పండుగకు షెడ్యూల్ ప్రకటించిన ప్రభుత్వం ఘనంగా నిర్వహించటం కోసం ఏర్పాట్లు చేస్తుంది. బోనాలు జరుగుతున్న రోజులన్నీ తెలంగాణ వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంటుంది. సికింద్రాబాద్, పాతబస్తీ బోనాలకు రాష్ట్రం నుంచి దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ప్రజలు తరలి వస్తుంటారు.

## ఏపీ, తెలంగాణ అసెంబ్లీ సీట్ల పెంపు

### సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

**ఢిల్లీ, మహా:** తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపు విషయంలో సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ విషయంపై దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి, తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసు రాజకీయ, రాజ్యాంగ దృష్ట్యా రెండు రాష్ట్రాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్, 2014లోని సెక్షన్ 26 ప్రకారం, ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచాలని చట్టం సూచిస్తుంది. ఈ నిబంధన అమలు చేయాలని కోరుతూ డాక్టర్ కె. పురుషోత్తమ్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ చట్టం ప్రకారం, రెండు రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల, రాజకీయ ప్రాతినిధ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల సంఖ్యను సమీక్షించి పెంచాల్సి ఉంటుంది. అయితే, గత కొన్నేళ్లుగా ఈ నిబంధన అమలు కాకపోవడంతో ఈ పిటిషన్ దాఖలైంది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కె.సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విస్తృతంగా వాదనలు చేసింది. పిటిషనర్ తరఫున వాదిస్తూ, రెండు రాష్ట్రాల్లో జనాభా వృద్ధి, భౌగోళిక అవసరాల ఆధారంగా అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచడం తప్పనిసరి అని ప్రస్తావించారు. ఏపీలో ప్రస్తుతం 175 అసెంబ్లీ సీట్లు, తెలంగాణలో 119 సీట్లు ఉన్నాయి. ఈ సంఖ్యను పెంచితే, ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగి, రాజకీయ ప్రాతినిధ్యం మరింత సమర్థవంతంగా ఉంటుందని వాదించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు విన్న ఎన్నికల సంఘం తమ స్థానాన్ని సమర్థించుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం, 2026 తర్వాత జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని వారు వాదించారు.

# విశాఖ జిల్లాలో దారుణం

### సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశ్రుతి

### గోడకూలి ఏడుగురు భక్తులు మృతి



**విశాఖ, మహా :** విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలింది. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.

**మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు**

మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో సాఫ్ట్‌వేర్ దంపతులు పిల్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నట్లు నిర్ధరించారు. వీరంతా విశాఖపట్నం నగరానికి చెందినవారు.

**మృతుల వివరాలు..**

- పత్తి దుర్గాస్వామి నాయుడు (32), మాచవరం, తూర్పుగోదావరి జిల్లా
- ఎడ్ల వెంకటరావు (48) అడవివరం, విశాఖపట్నం
- కుమ్మపట్ల మణికంఠ (28), మాచవరం, తూర్పు గోదావరి జిల్లా
- గుజ్జరి మహాలక్ష్మి (65), హెబీ కాలనీ, వెంకోజీ పాలెం, విశాఖపట్నం
- పైలా వెంకటరత్నం (45), ఉమానగర్, వెంకోజీ పాలెం, విశాఖపట్నం
- పిల్లా ఉమామహేశ్ (30), చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం
- పిల్లా శైలజ (26) చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం

## సింహగిరికి పోటెత్తిన భక్తులు

వరాహ లక్ష్మీనరసింహస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు భారీ ఎత్తున సింహగిరికి పోటెత్తారు. వేకువజామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరుచేశారు. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాల అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి తొలి చందనాన్ని సమర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తితిదే పట్టు వస్త్రాలు సమర్పించారు.

# మే 15న కాళేశ్వరానికి సీఎం

### సరస్వతీ నది పుష్కరాలు ప్రారంభించనున్న సీఎం

**కాటారం , మహా :** త్రిలింగ క్షేత్రం కాళేశ్వరం త్రినదుల కలయిక అంతర్వాహిని నదిగా సరస్వతీ నది పుట్టుక ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ఒకే పానవట్టంపై ద్విలింగాలు ఇంతటి ప్రత్యేకతలు కలిగిన మహిమాన్విత క్షేత్రం కాళేశ్వరానికి ఈనెల 15వ తేదీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సరస్వతి నది పుష్కరాలను మే 15వ తేదీన కాళేశ్వరంలోని విఐపి ఘాట్లో సీఎం ప్రారంభించనున్నారు. ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని బుధవారం కాళేశ్వరంలో పర్యటించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. వీఐపీ ఘాటుకు సమీపంలో రెండు హెలికాప్టర్లను సిద్ధం చేయాలని అధికారుల ను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. సరస్వతి పుష్కరాలకు ఏర్పాట్ల తో పాటు రూ ,25 కోట్ల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనుల అన్నింటిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోజున ప్రారంభించనున్నట్లు తెలిసింది. సరస్వతి నది పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు మే 15వ తేదీ ముందుగానే పూర్తి చేయాలన్నారు. నా సొంత నియోజకవర్గ కావడంతో పనులన్నీ కాలంలో పూర్తయ్యేలా చూసి ఆదర్శంగా నిలవాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. పుష్కరాలకు 15 రోజులు మాత్రమే గడువు ఉండడంతో క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాత్రి పగలు అనే సమయం లేకుండా ఏ సమయంలోనైనా అకస్మాత్తుగా స్వయంగా తనిఖీ చేయనున్నట్లు అధికారులకు సుతి మెత్తగా హెచ్చరించారు. పుష్కరాల ను చేస్తున్న ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ ఇతర సౌకర్యాలు పై రోడ్డు మ్యాప్ ను అధికారులు మంత్రి శ్రీధర్ బాబుకు వివరించారు.

## కాంగ్రెస్.. కులగణనకు వ్యతిరేకి

### దేశవ్యాప్తంగా కులగణన

### మోదీ సర్కార్ ఘనతే : బండి సంజయ్

**హైదరాబాద్, మహా :** కుల గణనకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకి అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఆ పార్టీ పాలనలో జనాభా లెక్కల్లో కులగణన చేపట్టకపోవడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కులగణన ఎందుకు చేయలేదో చెప్పాలన్నారు. దేశవ్యాప్తంగా కులగణన మోదీ సర్కార్ ఘనతేనని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కులగణన సర్వే అంతా తప్పుల తడకేనని విమర్శించిన సంజయ్.. కేంద్రం నిర్వహించబోయే కులగణన అత్యంత శాస్త్రీయమైనదిగా పేర్కొన్నారు. దీంతో కులాల వారీగా జనాభా ఎంతో తేలిపోతుందన్నారు. జనాభా ఆధారంగా రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

## శ్రామికులకు సీఎం రేవంత్ రెడ్డి మే డే శుభాకాంక్షలు

**హైదరాబాద్ :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం. మే' డే సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తి అన్ని రంగాలకు విస్తరిస్తుందని, కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని ఆయన అన్నారు. శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని అన్నారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే' డే స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు.

## సీఎంవో కార్యదర్శిగా శ్రీనివాసరాజు

### ఢిల్లీకి శశాంకగోయల్,, షానవాజ్ ఖాసీం బదిలీ

**హైదరాబాద్, మహా:** సీఎంవోకు పలువురు అధికారుల బాధ్యతల్లో ప్రభుత్వం మార్పులుచేర్పులు చేసింది. ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్ పోస్టింగ్‌లో తెలంగాణ ప్రభుత్వం మార్పు చేసింది. ఆయన్ను ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రత్యేక సీఎస్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల శశాంక్ గోయల్‌ను సీజీజీ డీజీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఆ పోస్టింగ్‌ను మార్చుతూ ఆయనకు ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రత్యేక సీఎస్‌గా పోస్టింగ్ ఇచ్చింది. సీఎం కార్యదర్శిగా ఉన్న షానవాజ్ ఖాసీం బదిలీ అయ్యారు. ఆయన్ను డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో పాటు ఎక్సైజ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకు ఈ రెండు పోస్టులు నిర్వహిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి కమలాసన్ రెడ్డి పదవీ విరమణ చేయడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే, విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజు సీఎం కార్యదర్శిగా నియమితులయ్యారు. శ్రీనివాసరాజు రెండేళ్ల పాటు ఈ పోస్టులో కొనసాగనున్నారు. ఇదిలా ఉండగా.. పదవీ విరమణ చేసిన కమలాసన్ రెడ్డిని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్డీగా నియమించారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## హైదరాబాద్ కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణ

### నగరంలో మరిన్ని కొత్త లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు

### వివరాలు తెలిపిన సీపీ సీవీ ఆనంద్.. కొన్ని పోలీసు స్టేషన్ల పేర్ల మార్పు

**మహా :** హైదరాబాదు సిటీ పోలీసు కమిషనరేట్ పునఃవ్యవస్థీకరణలో భాగంగా తీసుకున్న కొత్త నిర్ణయాలు, వాటి వివరాలను సీపీ ఆనంద్ తెలిపారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ ను 35 సంవత్సరాల తర్వాత జి.ఓ.ఎం.ఎస్. నెం. 32, (హోం లీగల్ డిపార్ట్‌మెంట్) ద్వారా తేది 30.04.2023 నాడు పోలీసు పునః వ్యవస్థీకరణ చేయడానికి ఉత్తర్వులు చేసారు. ఈ జి.ఓ. ప్రకారం రెండు అదనపు లా అండ్ ఆర్డర్ జోన్‌లు (సౌత్ ఈస్ట్ + సౌత్ వెస్ట్), 11 కొత్త లా అండ్ ఆర్డర్ డివిజన్‌లు, ఒకటి అదనపు ట్రాఫిక్ జోన్ (ట్రాఫిక్ 3), మరో 11 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లు (మొత్తం 71), 13 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు (మొత్తం 31) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే నగరంలో ఉన్న 7 జోన్‌లకు 7 మహిళా పోలీస్ స్టేషన్‌లతో మహిళా భద్రతా విభాగం, ప్రత్యేక సైబర్ క్రైమ్ యూనిట్, ఐటీ వింగ్, నార్కోటిక్స్ వింగ్ ఏర్పాటు చేసారు. ఈ మార్పుల కోసం అదనంగా 1200 మంది సిబ్బందిని మంజూరు కూడా చేసారు. గత 2 సంవత్సరాలుగా, పోలీసు స్టేషన్ హద్దులపై అలాగే కొత్త పోలీస్ స్టేషన్‌లకు వెళ్లడంలో ఎదురవుతున్న సమస్యలపై ప్రజల నుండి కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. ట్రాఫిక్ పోలీసులకు, లా అండ్ ఆర్డర్ పోలీసులకు కొన్ని ప్రాంతాలలో అధికార పరిధిపై గందరగోళం ఉండటం, సైబర్ క్రైమ్ వింగ్‌ను మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందని హైదరాబాదు సిటీ అధికారులు అందరితో చర్చించి, ప్రభుత్వానికి తెలిపారు. ప్రభుత్వం పై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా మొత్తం హైదరాబాదు సిటీ పోలీసుకు మంజూరైన 17,020 మంది సిబ్బందిని అంతర్గత సర్దుబాటు, పునః కేటాయింపులు మార్పులతో ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపారు.

## ఏపీలో సీఎం రేవంత్ క్రేజ్

- దేవినేని కుమారుడి వివాహానికి హాజరు
- చూసేందుకు ఎగబడ్డ జనం.. సెన్సేషన్
- ప్రత్యేక ఆకర్షణగా సీఎం రేవంత్, మంత్రి లోకేష్

**విజయవాడ, మహా, ఏప్రిల్ 30:** ఏపీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభిమానులు, స్థానికులు బ్రహ్మరథం పట్టారు. ఆయనను చూసేందుకు స్థానికులు ఆసక్తిని ప్రదర్శించారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులు నిహార్, శ్రీసాయి నర్మదలను సీఎం ఆశీర్వదించారు. హైదరాబాద్ నుంచి విజయవాడలోని ధనేకుల ఇంజనీరింగ్ కాలేజ్‌కు ప్రత్యేక హెలికాప్టర్‌లో రేవంత్ చేరుకున్నారు. వివాహ వేదిక వద్ద తెలంగాణ సీఎంకు ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలసౌరి స్వాగతం పలికారు. ఈ వివాహానికి మంత్రి లోకేష్ కూడా హాజరయ్యారు. నూతన దంపతులను ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి లోకేష్ ఆశీర్వదించించారు. ఈ పెళ్లిలో సీఎం రేవంత్, మంత్రి లోకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మండపంలోకి సీఎం రేవంత్‌తో పాటు మంత్రి లోకేష్ కలిసివచ్చారు. రేవంత్‌ను చూసేందుకు జనం ఆసక్తి కనబరిచారు. రేవంత్ ను స్థానిక నేత తరహాలో.. ఫుల్ జోష్‌లో అక్కడి ప్రజలు స్వాగతించారు. రేవంత్ ఫొటోలు తీసేందుకు వీడియోలు తీసేందుకు, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

EDITORIAL సంపాదకీయం

# కాళేశ్వరం మానవ నిర్మిత భారీ విపత్తు?

> ప్రపంచంలోనే అద్భుతమైన మానవ నిర్మిత కట్టడంగా,ఇంజనీరింగ్ అద్భుతంగా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చేసిన ప్రచారం అంతా ఇంతా కాదు.తీరా అదంతా 'డొల్ల' అని తేలినపుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం ఆత్మరక్షణలో పడుతుందని కొందరు అమాయకంగా భావించారు. "కేంద్రప్రభుత్వ జేబు సంస్థగా ఎన్ డీఎస్ ఏ పనిచేస్తోంది. ఆ నివేదిక రాజకీయ ప్రేరేపితం" అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కాగా "ఎన్ డీ ఎస్ ఏ రిపోర్టు బీజేపీ ఆఫీసులో తయారైన వంటకం" అని కేటీఆర్ కొన్ని రోజుల కిందటే అన్నారు. గతంలో ప్రగతిభవన్,ఇప్పుడు ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ లో రూపొందితే తప్ప ఏ రిపోర్టునూ బిఆర్ఎస్ నాయకులు అంగీకరించేలా లేరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

సామాన్య ప్రజల్ని కట్టిపడేసే మాయను బిఆర్ఎస్ నాయకులు అభ్యసించినంతగా మరెవరూ అభ్యసించలేదు.'నకిలీ అద్భుతాన్ని చూపించి నిజ జీవితాన్ని మరిచిపోయేలా చేయడం. నీకు అవసరం లేని దానిని కావాలని అనిపించేలా చేయడం. నిజమైన జీవితం కాకుండా మాయా ప్రపంచంలో బతికేలా చేయడం'... ఒక మాయ.ఈ మిథ్య మనుషుల మనసును సులభంగా వశపరచుకుంటుంది. ''జనానికి గొప్పగా ఉండేవి అంటే చాలా ఇష్టం. అవి వాళ్ళను ఆశ్చర్య చకితులను చేసేంత అద్భుతంగా,విశ్వరూపంలో కనిపించాలి. మీరు చూపించే అద్భుతాలను చూసేందుకు జనం తండోప తండాలుగా వస్తారు. కళ్ళకు కనిపించేదే వాళ్ళ హృదయాలకు సూటిగా తగులుతుంది'' అని 1469 1527 కు చెందిన రాజకీయ తత్వవేత్త మాకియవెలి అన్నాడు.మాకియవెలి సూత్రాన్ని కేసీఆర్,కేటీఆర్,హరీశ్ రావు అక్షరాలా పాటిస్తున్నట్టు కనిపిస్తోంది.ప్రపంచంలోనే అద్భుతమైన మానవ నిర్మిత కట్టడంగా,ఇంజనీరింగ్ అద్భుతంగా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చేసిన ప్రచారం అంతా ఇంతా కాదు.తీరా అదంతా 'డొల్ల' అని తేలినపుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం ఆత్మరక్షణలో పడుతుందని కొందరు అమాయకంగా భావించారు. ''కేంద్రప్రభుత్వ జేబు సంస్థగా ఎన్ డీఎస్ ఏ పనిచేస్తోంది.ఆ నివేదిక రాజకీయ ప్రేరేపితం'' అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు.కాగా ''ఎన్ డీ ఎస్ ఏ రిపోర్టు బీజేపీ ఆఫీసులో తయారైన వంటకం'' అని కేటీఆర్ కొన్ని రోజుల కిందటే అన్నారు.గతంలో ప్రగతిభవన్,ఇప్పుడు ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ లో రూపొందితే తప్ప ఏ రిపోర్టునూ బిఆర్ఎస్ నాయకులు అంగీకరించేలా లేరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.తమ వైపున తప్పు ఉన్నా సరే,అవతల ప్రత్యర్థులపై ఎదురుదాడి ఎలా చేయాలో బిఆర్ఎస్ దగ్గర శిక్షణ తీసుకోవలసిందే.



''కాళేశ్వరం కూలిన పాపం ముమ్మాటికీ బి.ఆర్.ఎస్ పాలకులదే. ఇంజినీరింగ్ వైఫల్యానికి ఇదో పరాకాష్ట.బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయంలో నిర్మించిన ప్రాజెక్టు వారి హయంలోనే కూలి పోయిందన్నారు. మెడిగడ్డ, సుందిళ్ళ బ్యారేజిల నిర్మాణాలు పూర్తిగా కూలి పోయాయని ఎన్.డి.ఎస్.ఏ నివేదికలో స్పష్టం అయింది.కాళేశ్వరం పేరుతో బి.ఆర్.ఎస్ పాలకులు చేసిన అప్పులు మూడు తరాలకు భారంగా పరిణమించగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యింది.నాటి ప్రభుత్వం భారీ వడ్డీలతో చేసిన రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా 16,000 కోట్లు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది.ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థతో పాటు తెలంగాణా రైతాంగానికి మోయలేని భారంగా మారింది.ఎన్.డి.ఎస్.ఏ నివేదిక ప్రకారం భద్రతా ప్రమాణాలు పాటించలేదు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారు.2019 నుండే నీళ్లు కారడం,పగుళ్లు ఏర్పడడం జరిగినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.ఇంతటి విపత్తుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవు.రాష్ట్ర మంత్రి వర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం''అని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏప్రిల్ 29 న మీడియా సమావేశంలో చెప్పారు.

'కాళేశ్వరం బ్యారేజీల డిజైన్‌లు/డ్రాయింగ్‌లు సంపూర్ణంగా అధ్యయనం చేసే అవకాశాన్ని అప్పటి సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులు మాకు ఇవ్వలేదు. హడావుడిగా డిజైన్లు/డ్రాయింగ్‌లపై సంతకాలు చేయాలని కేసీఆర్, హరీశ్‌రావు తొందరపెట్టారు. రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఈఎన్‌సీ బి.హరిరాం నాపై ఒత్తిడి చేశారు. 3 డీ అధ్యయనం తర్వాత డి జైన్లు/డ్రాయింగ్‌లు రూపొందించాల్సి ఉండగా 2 డీ అధ్యయనం తర్వాతే వీటిని తయారు చేయాల్సిన పరిస్థితి ఒత్తిళ్ల కారణంగా ఏర్పడింది. ఉన్నతస్థాయిలో జరిగిన ఏ సమీక్షకూ నన్ను పిలవలేదు.ఇచ్చిన డిజైన్లు/డ్రాయింగ్‌ల ప్రకారం పనులు జరుగుతున్నాయా? లేవా? పరిశీలించాల్సిన బాధ్యత నాపై ఉన్నా గత ప్రభుత్వం ఆ అవకాశమే ఇవ్వలేదు. నిర్మాణం చేపట్టడానికి ముందు బ్యారేజీలు కట్టే ప్రదేశాన్ని పరిశీలించి,ఎంత పొడవుతో కడుతున్నారనే వివరాలు తెలుసుకోవడం తప్ప మిగతా అంశాలను పరిశీలించలేదు.నాటి ముఖ్యమంత్రే డిజైన్లను ఖరారు చేశారు.మేడిగడ్డ బ్యారేజీ డిజైన్లు/డ్రాయింగ్‌లను సీడీవోతో కలిసి ఎల్ అండ్ టీ తయారు చేసింది. బ్యారేజీలు 2019 జూన్‌లో ప్రారంభం కాగా... వాటిని నాలుగేళ్లపాటు పట్టించుకోలేదు. నాలుగేళ్ల పాటు బ్యారేజీలను వదిలేయడం వల్లే వైఫల్యం చెందాయి''. అని జస్టిస్ పీసీ.ఘోష్ కమిషన్ ఎదుట విచారణలో మాజీ ఈఎన్‌సీ ,సెంట్రల్ డి జైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) ఎ.నరేందర్‌రెడ్డి వెల్లడించారు.

> కాళేశ్వరం ప్రాజెక్టు 'మానవ నిర్మిత విపత్తు'గా తేలిపోయింది.ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే ఇదొక 'తెల్ల ఏనుగు'అని విమర్శలు వచ్చాయి.కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీతో పాటు అన్నారం,సుందిళ్ల బ్యారేజీలు కూడా ప్రమాదంలో ఉన్నట్లుగా 'జాతీయ డ్యాముల భద్రతా సంస్థ' రిపోర్టు ఇవ్వడం సంచలనం.

> కాళేశ్వరంలో లక్ష కోట్ల నిధులు పారాయి కానీ లక్ష ఎకరాలకు కూడా సాగునీరు అందలేదని స్పష్టం అవుతుంది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని 180 టీఎంసీల నీటితో 18.26 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా డిజైన్ చేశారు. 2016 మే 2వ తేదీన శంకుస్థాపన చేసి,2019 జూన్ 21వ తేదీన ప్రారంభించారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ తెల్ల ఏనుగులా మారింది.

అయితే కేసీఆర్ ఇందుకు విరుద్ధంగా మాట్లాడారు.''కాళేశ్వరం ప్రాజెక్టును మేము డిజైన్ చేయలేదు.కాంగ్రెస్ నాయకుల మూర్ఖత్వానికి ఇది పరాకాష్ట.నాకు ఇంజినీరింగ్ భాషే రాదు. రాజకీయ నాయకులు స్ట్రాటజిస్టులే తప్ప డిజైన్ చేసేవాళ్లం కాదు. సీఎం అయ్యాక తక్కువ ముంపుతో వరద నీటిని తీసుకొని వాడుకోవాలనేది వ్యూహం రచించా. దానికి మూడు బ్యారేజీలు. ఎల్లంపల్లి, మిడ్‌మానేరును పూర్తి చేయాలి.ఒక బ్యారేజ్ నుంచి మరో బ్యారేజ్‌కి తీసుకుంటూ.. గోదావరిని సజీవం చేసుకుంటూ నీళ్లను గడ్డ మీదుకు తెచ్చుకోవాలి. ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుఅన్నపూర్ణరంగనాయకసాగర్‌మల్లన్నసాగర్‌కొండపోచమ్మ సాగర్. ఈ క్రమంలో ప్రతి స్టేజీలో లక్షల ఎకరాల్లో నీళ్లు వస్తయ్. మిడ్‌మానేరు ఎస్సారెస్పీ పాత ఆయకట్టుకు నీరిస్తది. అప్పర్ గోదావరి నుంచి బాబ్రీ తదితర అనేక చెక్‌డ్యామ్‌లు కట్టుకొని నీళ్లు తీసుకుంటుంది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరుకు కాళేశ్వరం ద్వారా అవసరం అనుకుంటే సరఫరా చేయాలని నిర్ణయించాం. ఎస్సారెస్పీ ఆయకట్టు సంపూర్ణంగా ఉండాలి. ఆ తర్వాత పాత మెదక్ జిల్లా. సింగూరు నుంచి నిజాంసాగర్‌కు వెళ్లి నిజామాబాద్ జిల్లా సుభిక్షంగా ఉంటది. ఎస్సారెస్పీ పునరుజ్జీవంతో ఆయకట్టు సేఫ్‌గా ఉంటుంది. అలా 40లక్షల ఎకరాలకు కాళేశ్వరం ప్రాజెక్టు ఢోకా లేదు'' అని కేసీఆర్ 2024 ఏప్రిల్ లో ఒక న్యూస్ ఛానల్ లో మాట్లాడుతూ చెప్పారు.

కాగా కాళేశ్వరం ప్రాజెక్టు 'మానవ నిర్మిత విపత్తు'గా తేలిపోయింది.ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే ఇదొక 'తెల్ల ఏనుగు'అని విమర్శలు వచ్చాయి.కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీతో పాటు అన్నారం,సుందిళ్ల బ్యారేజీలు కూడా ప్రమాదంలో ఉన్నట్లుగా 'జాతీయ డ్యాముల భద్రతా సంస్థ' రిపోర్టు ఇవ్వడం సంచలనం.2014కంటే ముందు నీళ్ల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయం మీద కొట్లాడి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నాం! కానీ కేసీఆర్ హయాంలో తెలంగాణ ప్రభుత్వం గోదావరి, కృష్ణా నదుల నీళ్లు,ప్రాజెక్టుల విషయంలో చేసిన నిర్వాకాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.''ప్రభుత్వ ఖజానాను కేసీఆర్ లూటీ చేశారు''అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏప్రిల్ 28 న మీడియాకు చెప్పారు.ఆయన చెబుతున్న 'లూటీ'లో సింహభాగం కాళేశ్వరం 'మింగినట్టు' అనుమానాలు కలుగుతున్నవి.కాళేశ్వరం ఒక విఫల పథకంగా,బీఆర్ఎస్ ప్రభుత్వ ఇంజనీరింగ్ తప్పిదంగా రుజువవుతోంది.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ,అన్నారం,సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ లోపాలు తెలంగాణకు శాపంగా మారాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు,రాష్ట్ర ప్రజలను కుంగుబాటుకు గురి చేసింది.ఆ ప్రాజెక్ట్ వైఫల్యం కేవలం కుంగుబాటు సంఘటనతోనే బయటపడలేదు.ఈ వైఫల్యం గురించి అప్పటి సీఎం కేసీఆర్ కు,అధికారులకు ముందే తెలుసని నిపుణులంటున్నారు.బీఆర్ఎస్ సర్కారు అసమర్థ ప్రణాళికల కారణంగా భారీగా ప్రజాధనం వృథా కావడంతో పాటు రాబోయే తరాలూ తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నా అభిప్రాయం వ్యక్తమవుతోంది.డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు,డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. తెలంగాణలోని 16.4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రాణహిత నదిపై 152 మీటర్ల స్థాయిలో 165 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా ప్రాణహితఎల్లంపల్లిచేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద నిర్మించాలని తలపెట్టారు.తుమ్మిడిహట్టి వద్ద 165 టీఎంసీల నీరు అందుబాటులో లేదని కేంద్ర జల సంఘం పేర్కొన్నట్టు 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పింది అసత్యమని ఆలస్యంగా తేలింది. కానీ అక్కడ 165 టీఎంసీల లభ్యత ఉంటుందని కేంద్రజలసంఘం చెప్పినా ప్రాజెక్టును రీఇంజనీరింగ్ చేసి లొకేషన్‌ను మేడిగడ్డకు మార్చారు. ప్రాణహిత చేవెళ్లతో పోల్చితే కాళేశ్వరం నిర్మాణ ఖర్చు చాలా ఎక్కువ అని కూడా కేసీఆర్ కు తెలుసు.

2016లో కాళేశ్వరం డీపీఆర్ తయారీయే చాలా హడావుడిగా జరిగింది.సాధారణంగా బ్యారేజీల డిజైన్లు, ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర అంశాలపై తుదినిర్ణయం తీసుకోవడానికి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) నోడల్ యూనిట్‌గా ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సరైన డిజైన్లు రూపొందించడానికి సీడీవోకు తగినంత సమయం ఇవ్వలేదు. తగినంత సమయం ఇవ్వకుండా ప్లానింగ్, ఇన్వెస్టిగేషన్ హడావుడిగా చేయడంతో ప్రాజెక్టుకు సరైన డిజైనింగ్ జరగలేదు. ప్రాజెక్టు కట్టే చోట జియోటెక్నికల్ పరిశోధనలు చేయడం, నాణ్యత, పర్మియబిలిటీని (రాళ్ల గుండా నీరు ప్రవహించే సామర్థ్యం) పరీక్షించడం, ఆ డేటాతో నిర్మాణాలను ప్లాన్ చేయడం.. వీటన్నింటికీ 8 నెలల నుంచి ఏడాది దాకా పడుతుంది. కానీ.. డీపీఆర్ తయారీకి 4నెలల సమయమే ఇచ్చారు. జియోటెక్నికల్ పరిశోధనకూ తగిన సమయం ఇవ్వలేదు. ప్లానింగ్, డిజైన్లపై ఇవి తీవ్రప్రభావం చూపాయి.డీపీఆర్ తయారీకి ముందే బ్యారేజీల నిర్మాణం ప్రారంభమైంది.

మూడు బ్యారేజీల నిర్మాణం తలపెట్టినచోట జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ చేసి డీపీఆర్‌లో పొందుపరిచారు. డీపీఆర్‌ను సమర్పించిన తర్వాత అన్నారం,సుందిళ్ల బ్యారేజీ స్థలాలను ప్రభుత్వం మార్చేసిందన్నా విమర్శలున్నవి. ఇంత పెద్ద ప్రాజెక్టు నాణ్యతను థర్డ్‌పార్టీతో ఆడిట్ చేయించలేదన్న విమర్శలూ ఉన్నాయి.మేడిగడ్డ బ్యారేజీలో 2019లో వర్షాకాలం ప్రారంభమైన వెంటనే కటాఫ్ వాల్ దిగువన ఉన్న సీసీ బ్లాకుల దిగువ ప్రాంతంలో నీరు బయటకు రావడం ప్రారంభమైనట్టు కనుగొన్నారు. అయినా రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీటిని మరమ్మతుల కోసం ఖాళీ చేయకుండా అవసరాలకు వాడుకుంటూ వచ్చారు. మరమ్మతులు, కాలానుగుణ నిర్వహణ ప్రొటోకాల్ పూర్తిగా లేకపోవడంతో ఏటా క్రమంగా క్షీణించి, చివరికి మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది.

ఎగువన ఉన్న అన్నారం,సుందిళ్ల బ్యారేజీలు కూడా మేడిగడ్డ లాగా ఒకే రకమైన డిజైన్లు, నిర్మాణ పద్ధతులను కలిగి ఉండడంతో అవి కూడా ప్రమాదంలో పడినట్లుగా ఎన్ డి ఎస్ ఏ తెలిపింది. కాళేశ్వరం ఆయకట్టు అంతా కనికట్టేనని 'కాగ్' నివేదిక నిగ్గు తేల్చింది.18.26లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీళ్లు ఇచ్చే విధంగా డిజైన్ చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో 2022 మార్చి నాటికి కేవలం 40,888 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీళ్లు ఇచ్చినట్లు కాగ్ స్పష్టం చేసింది. దీనిని బట్టి పరిశీలిస్తే కాళేశ్వరంలో లక్ష కోట్ల నిధులు పారాయి కానీ లక్ష ఎకరాలకు కూడా సాగునీరు అందలేదని స్పష్టం అవుతుంది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని 180 టీఎంసీల నీటితో 18.26 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేలా డిజైన్ చేశారు. 2016 మే 2వ తేదీన శంకుస్థాపన చేసి,2019 జూన్ 21వ తేదీన ప్రారంభించారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ తెల్ల ఏనుగులా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 18.83 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టించడంతోపాటు, మరో 4.71 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం.

కొత్త ఆయకట్టు, స్థిరీకరించిన ఆయకట్టులో పండే పంటలకు ఎత్తిపోసే నీళ్లు, తాగునీరు, పరిశ్రమలకు అందించే నీటికి అయ్యే ఖర్చుతోపాటు ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న రుణ వాయిదాల చెల్లింపు కలిపి రూ.28,081.54 కోట్లుగా ఉంటే,వాటన్నింటి ద్వారా ఆదాయం మాత్రం రూ.14,709.84 కోట్లుగా ఉన్నదని కాగ్ తన నివేదికలో వెల్లడించింది.ఇందులో ఎత్తిపోతలకు అయ్యే విద్యుత్తు చార్జీలు రూ.10,374.56 కోట్లు,నిర్వహణ ఖర్చులు రూ.272.70 కోట్లు కలిపి రూ.10647.26 కోట్లు అవుతుందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. దాదాపు లక్ష కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్ట్‌కు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణం రూ.64.204.13 కోట్లు. వడ్డీలు సకాలంలో చెల్లించకుండా వాయిదా వేయడంతో అదనంగా మరో రూ.19,556.4 కోట్ల వడ్డీ అసలులో కలిసింది. దీంతో అసలు రూ.87,369.89 కోట్లు అయింది. దీనికి వాయిదాలుగా ప్రతి ఏటా వడ్డీ, అసలు కింద రూ.10 వేల కోట్ల నుంచి 14 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని కాగ్ తెలిపింది.

దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్వహణ ప్రభుత్వానికి భారంగా మారింది పైగా ఈ ప్రాజెక్ట్‌కు తెచ్చిన అప్పులు తీర్చడం కోసం కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని 'కాగ్' హెచ్చరించింది. జరిగిన నష్టానికి తమకు సంబంధం లేదని 2019 లోనే కాంట్రాక్టర్లు ప్రకటించిన విషయాన్ని' కాగ్' బట్టబయలు చేసింది.తమకు ఇచ్చిన డిజైన్ల ప్రకారమే తాము పనులు చేశామని, అలాంటప్పుడు జరిగిన నష్టానికి తామెలా బాధ్యులమవుతామని ప్రశ్నిస్తున్నారు.నిధులు ఇస్తే పనులు చేయడానికి గుత్తేదార్లు ముందుకు వచ్చారు దీంతో సాగునీటి శాఖనే ఈ పనులు చేపట్టడానికి రూ. 470.03 కోట్లతో అంచనాలు రూపొందించింది. కానీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు చేపట్టలేదు.ప్రాజెక్టను ప్రారంభించిన తరువాత నిర్వహణ లోపం కారణంగానే మేడిగడ్డ కుంగినట్లు కేంద్ర జలశక్తి శాఖ నియమించిన ఆరుగురు సభ్యుల కమిటీ తేల్చి చెప్పిందని కాగ్ తెలిపింది.201920లలో మేడిగడ్డ ప్రాజెక్టును ప్రారంభించినప్పటి నుంచీ సిమెంట్ కాంక్రీట్ బ్లాక్‌లను,లాంచింగ్ అప్రాన్‌లను తనిఖీ చేయలేదని, నిర్వహించలేదని కమిటీ గుర్తించిందని కాగ్ తన నివేదికలో పొందుపర్చింది.బరాజ్‌ను పునరుద్ధరించే వరకు ఇది నిరుపయోగంగానే ఉంటుందని తెలిపింది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# అలసత్వం లేకుండా పుష్కరాల పనులు పూర్తి చేయాలి

## మంత్రి శ్రీధర్ బాబు




**కాటారం, మహా :** సరస్వతి నది పుష్కరాల నేపథ్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు అధికారులు అలసత్వం ప్రదర్శించకుండా పూర్తి చేయాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాలేశ్వరం ను టూరిజం హబ్ గా చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు. మే 15 నుండి 26వ తేదీ వరకు 12 రోజులపాటు జరిగే సరస్వతి నది పుష్కరాల సందర్భంగా జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. గోదావరి ప్రాణహిత నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద వి ఐ పి పుష్కర ఘాట్, గోదావరి నది ఘాట్ల వద్ద జరుగుతున్న మెట్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులను పుష్కరాల నాటికి ముందే పరితగతిన పూర్తి చేయాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గోదావరి నది లో గుడ్డలు, చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండేలా క్లీన్ చేయించాలని జిల్లా పరిషత్ సీఈఓ ను మంత్రి ఆదేశించారు. వంద గదుల అతిథి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. హరిత గృహంలో జిల్లా శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇటీవల మరణించిన మాజీ సర్పంచ్ రామ్ నారాయణ గౌడ్ కుటుంబాన్ని మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించి ఓదార్చారు. మహదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. పుష్కర మహోత్సవాలను దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు సమయానుకూలంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్దిద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరిలో వ్యర్థాలు తొలగించి పరిశుభ్రం చేయాలని సూచించారు. సమయం చాలా తక్కువగా ఉందని, ఆశించిన స్థాయిలో ఇప్పటి వరకు పనులు జరగలేదని అధికారులు గుర్తించి నిర్దిష్ట కార్యాచరణతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున, అన్ని విభాగాలు అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. పనులు వేగవంతం చేసేందుకు కూలీలను పెంచాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు.

**ఆక్సిడెంట్ బాధితులకు మంత్రి శ్రీధర్ బాబు చేయూత**

మంత్రి శ్రీధర్ బాబు మహాదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం గ్రామానికి వెళ్తుండగా బొమ్మాపూర్ క్రాస్ రోడ్ వద్ద కారు ఆటో యాక్సిడెంట్ జరిగింది మంత్రి శ్రీధర్ బాబు చూసి చలించి వాహనాన్ని అక్కడే నిలిపి ఆక్సిడెంట్ లో జరిగిన బాధితులకు వెంటనే వైద్యసహాయం అందించేందుకు మంత్రి కాన్వాయ్ కారులో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన పలువురికి వైద్యశాల అందించి చికిత్స చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఫార్మసీ ఆఫీసర్స్ జిల్లా అధ్యక్షులుగా నార్ల వేణు ఎన్నిక

## ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్



**వరంగల్ మహా;** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ వరంగల్ జిల్లా అధ్యక్షులు గా నార్ల వేణు ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులుగా నార్ల వేణు ను నియమిస్తూ తేది. 30.04.2025 రోజున రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుచూ ఎంజిఎం హాస్పిటల్ లో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ గా పని చేస్తున్న నార్ల వేణు గత 35 సంవత్సరాలుగా ఫార్మసీ ఆఫీసర్స్ సమస్యల పరిష్కారం కొరకు అవిశ్రాంతముగా కృషి చేశారని అతడి సేవలను గుర్తించి వరంగల్ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.



# పురపాలక శాఖ కార్యదర్శిని కలిసిన మేయర్

**వరంగల్ మహా;** ఇటీవల పురపాల శాఖ కార్యదర్శి (హెచ్ ఎం డి ఏ పరిధిలో)బయట గా బాధ్యతలు స్వీకరించిన డా.టి కే.శ్రీదేవి ని నగర మేయర్ గుండు సుధారాణి బుధవారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకం గా కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ నాయకుల పట్ల పవన్ వ్యాఖ్యలను ఖండించిన కంది శ్రీనివాస రెడ్డి

## చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని హితవు

### ప్రజా సేవాభవన్ లో ప్రెస్ మీట్ లో మాట్లాడిన కంది శ్రీనివాప రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** కాంగ్రెస్ నాయకులు పాకిస్తాన్ వెళ్లాలి అన్న ఏపీ డిప్యూటీ సీయం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను తప్పు బట్టారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మీడియా తో మాట్లాడారు. ఉగ్రవాదానికి బలైంది తమ కాంగ్రెస్ పార్టీ అని ఇద్దరు కాంగ్రెస్ ప్రధానమంత్రులు ఇందిరా గాంధీ రాజీవ్ గాంధీని పొట్టన బెట్టుకున్నది ఉగ్రవాదం కాదా అని గుర్తు చేసారు. ఇతర పార్టీని విమర్శించే ముందు ఒక సారి చరిత్ర తెలుసుకోవాలని పవన్ కళ్యాణ్ కు సూచించారు. ఒక గౌరవ ప్రదమైన పదవిలో ఉండి మాట్లాడాల్సిన మాటలు కావని అన్నారు. చరిత్ర చెరిపేస్తే చెరిగేది కాదన్నారు.దేశం కోసం ప్రాణాలర్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు.పహల్ గామ్ దాడిలో ప్రాణాలుకోల్పోయినవారికి నివాళ్లు అర్పిస్తున్నామన్నారు.వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఉగ్రవాదుల దాడి వెనుక పూర్తిగా కేంద్ర ప్రభుత్వ భద్రతా వైఫల్యముందన్నారు.లోకసభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సూచించిన విధంగా కేంద్రం వెంటనే ఇరు సభల్లో ఉగ్రవాద దాడిపై చర్చ పెట్టాలన్నారు. ఉగ్ర వాదాన్ని ఉక్కుపాదంతో అణచి వేయడానికి కేంద్రం ఏచర్యలు తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దుతు ఉంటుందన్న తమ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను సమర్థిస్తున్నమన్నారు.భారత దేశం జోలికొస్తే అంతా ఏకమై తిప్పి కొడతామన్నారు. ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా ప్రమాదమేనని దాన్ని పూర్తిగా ఉక్కు పాదంతో అణచి వేయాలన్నారు.అనంతరం క్యాంపు ఆఫీస్ బయట ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేసారు.ఏపీలోని సింహాచల అప్పన్న చందనోత్సవంలో మృతి చెందిన భక్తులకు నివాళ్ళు అర్పించారు.వారి కుంబాలకు సంతాపం తెలిసారు. ఘటనలో క్షతగాత్రులైనవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అలాగే ఇవాళ విడుదలైన పదవతరగతి పరీక్షా పలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.పిల్లలు ఇంకా ఉన్నత చదువులు చదవి జిల్లా కు మంచి పేరు తీసకురావాలని ఆకాంక్షించారు. ఇటీవల ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ ఎస్ సభపై విమర్శలు గుప్పించారు.200 కోట్లు ఖర్చు పెట్టి సభ నిర్వహించారని ఆరోపించారు. కేసీఆర్ ప్రసంగంలో ఎక్కడా బీజేపీ ప్రస్తావన లేదన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీని విమర్శించేందుకే అంత ఖర్చు పెట్టి సభను ఏర్పాటు చేసారన్నారు.బీఆర్ ఎస్ బీజేపీ ప్రభుత్వాలు సామాన్యుల గోడును పట్టించుకోలేదన్నారు.వారి హయాంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు.బీఆర్ ఎస్ కేహజ్ఞాంలో చేసిన 7లక్షలకోట్ల అప్పులకు ప్రస్తుతం ప్రభుత్వం వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్ని ఇబ్బందులెదురైనా ప్రజా సంక్షేమానికే పెద్ద పీఠ వేస్తుందన్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ఈ మీడియా సమావేశంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,ఎం.ఏ షకీల్,ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునిగేల విట్టల్, తాజా మాజీ కౌన్సిలర్లు బండారి సతీష్,యెల్మెల్వార్ రామ్ కుమార్,సంద నర్సింగ్,షేక్ ఇమ్రాన్,జాఫర్ అహ్మద్,తాజా మాజీ మున్సిపల్ కో.ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్ కుమార్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,నాయకులు బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న, సింగిరెడ్డి రామ్ రెడ్డి,దొగ్గలి రాజేశ్వర్,అల్చెట్టి నాగన్న,కొండూరి రవి,మొహమ్మద్ రఫీక్,ఎం.ఏ కయ్యుమ్,నిమ్మల ప్రభాకర్,అశోక్,అతిక్ ఉర్ రహమాన్,అంజద్ ఖాన్, అయాస్ పాల్గొన్నారు.



# తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వడగండ్లతో భారీ వర్షం

**వరంగల్, మహా;** తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో పలు చోట్ల వర్షం కురుస్తోంది. మరికొన్ని చోట్ల వడగండ్లు పడుతున్నాయి. మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, గద్వాల్, వనపర్తి, నల్గొండ, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఇక, రాబోయే మూడు రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే, నాలుగు రోజుల పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ శాఖ కేంద్రం.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం

## కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో కార్యక్రమం




**ఆదిలాబాద్ మహా :** ఉగ్ర వాదాన్నికూకటి వేళ్లతో పెకిలించి వేయాలని ఉక్కుపాదంతో అణచి వేయాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పహల్గామ్ లో ఉగ్రవాద దాడికి నిరసనగా బుధవారం తన క్యాంపు ఆఫీస్ బయట ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేసారు. పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేసారుఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా ప్రమాదమేనని దాన్ని పూర్తిగా అంతమొందించాలన్నారు.ఇందుకు కేంద్రం తీసుకునే చర్యలకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతునిస్తుందని తమ అగ్రనేత రాహల్ గాంధీ చెప్పడాన్ని గుర్తు చేసారు.దాడిలో మృతి చెందిన వారికి ఘన నివాళ్లు అర్పిస్తున్నామన్నారు. వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఈ మీడియా సమావేశంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,ఎం.ఏ షకీల్,ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునిగేల విట్టల్, తాజా మాజీ కౌన్సిలర్లు బండారి సతీష్,యెల్మెల్వార్ రామ్ కుమార్,సంద నర్సింగ్,షేక్ ఇమ్రాన్,జాఫర్ అహ్మద్,తాజా మాజీ మున్సిపల్ కో.ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్ కుమార్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,నాయకులు బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న, సింగిరెడ్డి రామ్ రెడ్డి,దొగ్గలి రాజేశ్వర్,అల్చెట్టి నాగన్న,కొండూరి రవి,మొహమ్మద్ రఫీక్,ఎం.ఏ కయ్యుమ్,నిమ్మల ప్రభాకర్,అశోక్,అతిక్ ఉర్ రహమాన్,అంజద్ ఖాన్, అయాస్ పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ ల హక్కులకై మహాధర్నా కార్యక్రమం

## వరంగల్ తూర్పు జర్నలిస్ట్ లకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

### బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్




**వరంగల్, మహా;** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధికార ప్రతినిధి ఆడేపు వెంకటేష్ అధ్యక్షతన బుధవారం హన్మకొండ ఏకశిల పార్క్ బాలసముద్రం వద్ద వరంగల్ తూర్పు జర్నలిస్ట్ ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకై మహాధర్నా కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ముందుండి పోరాడిన జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని కోరుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గం 12వ డివిజన్ లోని దేశాయిపేటలో గత రెండు సంవత్సరాల క్రితం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ముందు గత కొన్ని రోజులుగా నిరాహార దీక్ష చేపట్టిన తూర్పు వర్కింగ్ జర్నలిస్టులకు మద్దతుగా బీజేపీ మద్దతు ప్రకటించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారి కలలను నిజం చేస్తూ డబుల్ బెడ్ రూమ్ లను గత బిఆర్ఎస్ హయాంలో కేటాయించిన ఇండ్లను ఇవ్వలేకపోయారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16 నెలలు కావస్తున్న అర్హులైన జర్నలిస్టులకు గతంలో నిర్మించిన ఇండ్లను కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన జర్నలిస్టుల బ్రతుకులు మారడం లేదన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు ప్రతినిధులగా వారి మధ్య జరిగే సమాచారాన్ని తెలియపర్చే వారు జర్నలిస్టులని, వారికి పేపర్ సంస్థల నుండి ఎన్నో ఒత్తిళ్లు, ఆరోగ్య సమస్యలను అధిగమిస్తూ చాలీ చాలని వేతనాలతో కుటుంబ జీవనాన్ని గడుపుతున్నారు. ఇంటి అద్దె కట్టలేక, పిల్లల ఫీజులు చెల్లించలేక నాన అవస్థలు పడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడున్న రాజకీయ పరిణామాలు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడం వల్లనే లబ్ధిదారులను ఎంపిక చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ప్రభుత్వాలు ఏవి ఉన్నా జర్నలిస్టులను వాడుకోవడం, ప్రభుత్వం పోయాక మళ్ళీ వచ్చిన ప్రభుత్వం అదే తరహా జర్నలిస్టులను వాడుకుంటూ, గత ప్రభుత్వాల మాదిరిగానే చేస్తూ ఉండడం అనవాయితిగా మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16 నెలలు గడుస్తున్న గత ప్రభుత్వం చేసిన తప్పులనే ఈ ప్రభుత్వం చేస్తోంది. వరంగల్ తూర్పులో అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు ఇయ్యకపోవడం వలన అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. అందులో అసాంఘిక కర్యకలాపాలకు అడ్డాగా మారి జూదాలకు, వ్యభిచారులకు ఆశ్రయం ఐపోయి, తలుపులు, కిటికీలు, కరెంటు వైర్లు,నీటి పైపు లైను, ట్యాంకులు అన్ని ధ్వంసం చేశారు. తూర్పు శాసనసభ్యులుగా ఉన్న మంత్రి కొండా సురేఖ ఎన్నోసార్లు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ల దగ్గర పర్యటించినప్పటికీ జర్నలిస్టులపై అనుకూల భావన లేనట్లు కనిపిస్తుంది. అదే నిజమైతే గత ప్రభుత్వంలో భూమి కేటాయింపు నిధుల కేటాయింపు శంకుస్థాపన ప్రారంభోత్సవం ఏ రకంగా చేశారు. దీనిని ప్రభుత్వాలు ఎవరి కోసం నిర్మించాయి. ప్రస్తుత పాలకులు ఇది గమనించాలి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వారికి అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవడం సబబేనా అంటూ వరంగల్ తూర్పులో వర్కింగ్ జర్నలిస్టులు నిరాహార దీక్షలు చేపట్టారు. సమస్య శాంతియుతంగా పరిష్కారం కాకపోతే నగర నడిబొడ్డున తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం స్పందించి తూర్పు వర్కింగ్ జర్నలిస్టులకు త్వరగా ఇండ్లు కేటాయించాలని కోరారు. 12 ఏప్రిల్, 2021 రోజున వరంగల్ తూర్పు జర్నలిస్టుల కోసం డబల్ బెడ్రూంలు భూమి పూజ చేసిన అప్పటి మంత్రివర్యులు కేటీఆర్.. రెండు ఏండ్లలో 12 కోట్లు ఖర్చు పెట్టి, మొత్తం మూడు ఎకరాల భూమిలో, రెండు ఎకరాల్లో మొత్తం 9 బ్లాకులు కలిపి 200 డబల్ బెడ్ రూమ్ ల నిర్మాణం పూర్తి చేసిన అప్పటి తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, తేదీ 17 జూన్, 2023 నాడు నిర్మాణం పూర్తి చేసిన డబల్ బెడ్ రూం లు, అట్టహాసంగా ప్రారంభం చేసి, ఆరుగురు జర్నలిస్టుల గృహ ప్రవేశం, జర్నలిస్ట్ ల కాలనీగా, జర్నలిస్టుల కొరకే అని పేర్కొన్న అప్పటి ప్రభుత్వం, రెండు ఏండ్లుగా నిరుపయోగంగా మారాయి.

# దేశానికి దిక్సూచి నాడు బెంగాల్.. నేడు తెలంగాణ

## సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం

### తెలంగాణ ప్రభుత్వ చర్యల ఒత్తిడితోనే కేంద్రం కులగణనకు అంగీకారం

### ఒక బీసీ బిడ్డగా.. మంత్రిగా ఎంతగానో సంతోష పడుతున్న




**వరంగల్ మహా;** భారత దేశానికి దిక్సూచిగా నాడు బెంగాల్ ఉంటే... నేడు తెలంగాణే అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సామాజిక దృక్పథం కలిగిన తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం కులగణనకు అంగీకారం తెలిపిందని ఆమె అన్నారు. ఇది కేవలం తమ నాయకుడు రాహుల్ గాంధీ ఆశ, ఆశయమని.. తమ రాష్ట్ర ప్రభుత్వ పెద్దల కృషి అని సురేఖ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం అంటూ సురేఖ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల పట్ల ఒక బీసీ బిడ్డగా... మంత్రిగా ఎంతగానో సంతోష పడుతున్నట్టు ఆమె వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ నిర్ణయంపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బుధవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేసే జనాభా లెక్కల్లో కుల గణన చేస్తామనడం తెలంగాణ ప్రభుత్వ సంపూర్ణ విజయమని మంత్రి సురేఖ చెప్పుకొచ్చారు. తమ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా సామాజిక అసమానతలు, కుల రుగ్మతలు తొలగించడానికి దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సురేఖ గుర్తు చేశారు. రాష్ట్రంలో తమ మా ప్రభుత్వం చేపట్టిన కులగణన ఆధారంగా బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన కుల గణన ఆధారంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం చేసే జనాభా లెక్కల్లో కుల గణన చేస్తామని పేర్కొనడం సంతోషంగా ఉందన్నారు. ఇది ఒక్క విప్లవాత్మకమైన చర్యగా తాను అభివర్ణిస్తున్నట్టు చెప్పారు. దీని ద్వారా సామాజిక రుగ్మతలు తొలగి అందరికీ సామాజిక న్యాయం జరుగుతుందని ఆకాంక్షిస్తున్నట్టు మంత్రి సురేఖ తెలిపారు.

### కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు ఆఫీస్ లో

# ఘనంగా బసవేశ్వర జయంతి



**ఆదిలాబాద్ మహా :** సమాజంలో కుల వర్గ వర్ణ వివక్షను రూపుమాపడం కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మ బసవేశ్వరుడని జిల్లా ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ లో జరిగిన బసవేశ్వర 892వ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన పాల్గొన్నారు.బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. సమాజంలో స్త్రీ పురుషులిద్దరూ సమానమేనన్న భావనను ప్రజల్లో తీసుకువెళ్లి సమ సమాజ స్థాపనకు కృషిచేసిన మహనీయుడు బసవేశ్వరుడని కొనియాడారు. సాంఘిక, సాంస్కృతిక సంస్కర్తగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమం లో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,ఎం.ఏ షకీల్,ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునిగేల విట్టల్, తాజా మాజీ కౌన్సిలర్లు బండారి సతీష్,యెల్మెల్వార్ రామ్ కుమార్,సంద నర్సింగ్,షేక్ ఇమ్రాన్,జాఫర్ అహ్మద్,తాజా మాజీ మున్సిపల్ కో.ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్ కుమార్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,నాయకులు బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న పాల్గొన్నారు.

# బాలికల విజయగాధ..!

## ఎస్ఎస్సి ఫలితాల్లో హవా.. ఫలితాల్లో మెరిసిన ములుగు

**ఖమ్మం మహా.** తెలంగాణ పదవ తరగతి ఫలితాలు రాష్ట్ర విద్యా రంగ నిర్మాణానికి అద్దంగా నిలిచాయి. ఒకవైపు అత్యుత్తమ విజయాలు సాధించిన జిల్లాలు ఉన్నప్పటికీ, మరొకవైపు ఆశించిన స్థాయికి వెనుకబడ్డ జిల్లాలు కనిపిస్తున్నాయి. ఇది జిల్లాల మధ్య విద్యా సమతుల్యత కొరవడుతున్న సంకేతం. 92.78 శాతం మొత్తం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ప్రగతి ఆశాజనకంగా ఉన్నా, జిల్లాల మధ్య గల వ్యత్యాసాలు సమగ్ర మదింపు కోరుకుంటున్నాయి. బాలికల అద్భుత ప్రదర్శన, ప్రభుత్వ పాఠశాలల మెరుగైన ఫలితాలు నూతన ఆశల్ని నింపుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పదవ తరగతి ఫలితాలు ఈ ఏడాది విద్యా రంగానికి ఒక మైలురాయిగా నిలిచాయి. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలో మొత్తం 4,94,207 మంది పరీక్ష రాస్తే, 4,59,081 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇది గత సంవత్సరాలకంటే మెరుగైన విజయశాతం. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారం - ఈ మూడింటి కలయిక ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయి. ములుగు జిల్లా - రాష్ట్రంలోనే అత్యుత్తమ విజయాన్ని నమోదు చేసింది. 99.40 శాతం ఉత్తీర్ణత సాధించడం, అక్కడి విద్యా వ్యవస్థలో నిబద్ధత, ఉపాధ్యాయ శ్రమ స్పష్టంగా చెప్పకనే చెబుతోంది. తక్కువ వనరుల మధ్య విద్యార్థులు సాధించిన ఈ ఘనత రాష్ట్రానికి ప్రేరణగా నిలిచింది. మహబూబాబాద్, నల్గొండ, ఖమ్మం, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హనుమకొండ, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్ వంటి జిల్లాలు కూడా 97% కు పైగా విజయశాతం నమోదు చేసి రాష్ట్రానికి గర్వకారణమయ్యాయి.

ఈ జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలలనే ఆధారంగా విద్యార్థులు రాణించడమే విశేషం. అయితే మరోవైపు గద్వాల జిల్లా తీవ్ర ఆవేదన కలిగించే స్థాయిలో 69.77 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదు చేసింది. రాష్ట్రంలో ఇది అత్యల్ప స్థాయి. ఇది అక్కడి విద్యా వనరుల లోపం, బోధనా నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. హైదరాబాద్ (85.53%), మహబూబ్‌నగర్, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, పెద్దపల్లి, జనగామ, కరీంనగర్ వంటి జిల్లాల్లో విజయశాతం సరాసరికి కిందగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. బాలికల విజయగాధ: ఈ ఏడాది బాలికలు 94.26 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురం 91.32 శాతంతో రాణించారు. ఇది మహిళా విద్య ప్రాధాన్యతను, సమాజంలో వస్తున్న మార్పును ప్రతిబింబిస్తోంది. ఈ సందర్భంగా బాలికలకు మరింత విద్యా వనరులు, భద్రత, ప్రోత్సాహం పెంచాల్సిన అవసరం ప్రభుత్వానికి గుర్తించదగిన అంశం. ప్రభుత్వ పాఠశాలలు మారుతున్న దృశ్యం: గతంలో ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే వెనుకబడినట్టుగా చెప్పబడిన ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు విజయవంతంగా విద్యార్థులను ఉత్తీర్ణులుగా తయారుచేస్తున్నాయి. ఉపాధ్యాయుల నిరంతర శిక్షణ, డిజిటల్ పాఠాలు, విద్యా వాలంటీర్ల సహకారం, ముఖ్యంగా మానవ వనరుల వినియోగం ప్రభుత్వ పాఠశాలల విజయానికి దోహదం చేసింది. పునర్వ్యవస్థీకరణకు అవసరం: గద్వాల వంటి జిల్లాల్లో ప్రత్యేక విద్యా అభివృద్ధి ప్రణాళికలు తీసుకురావాలి. ఉపాధ్యాయుల తగిన సంఖ్య నియామకాలు, మౌలిక వసతుల విస్తరణ, తల్లిదండ్రుల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పైగా, జిల్లాల మధ్య సమాన విద్యా వనరుల నిబద్ధతతోనే విద్యా రంగానికి స్థిర పునాదులు వేసే అవకాశం ఉంటుంది.

# రోజూ 13,698 వాహనాలు అమ్ముతారట!

## వరుసగా నాలుగో ఏడాదీ ప్యాసింజర్ వాహనాల రికార్డు అమ్మకాలు

### గ్రామీణ రికవరీతో ఎంట్రీ కార్లకు డిమాండ్.. 2025–26పై క్రిసిల్ రేటింగ్స్ అంచనాలు



వార్షిక ప్రాతిపదికన వృద్ధి 2-4 శాతానికి పరిమితమైనా.. దేశీ, విదేశీ మార్కెట్లలో అమ్మకాల దన్నుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్యాసింజర్ల వాహనాల విక్రయాలు 50 లక్షల మార్కును తాకే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ ఒక నివేదికలో వెల్లడించింది. అంటే రోజూ 13,698 వాహనాలు విక్రయిస్తారని అంచనా వేసింది. తద్వారా వరుసగా నాలుగో ఏడాదీ రికార్డు అమ్మకాలు సాధించినట్లవుతుందని క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది. సాధారణం కన్నా మెరుగైన వర్షపాతం ఉంటుందనే అంచనాలతో గ్రామీణ ప్రాంతాలు కోలుకుంటే ఎంట్రీ-స్థాయి కార్లకు డిమాండ్ మెరుగుపడొచ్చని వివరించింది. 'ప్యాసింజర్ వాహనాల వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరం 2-4 శాతానికి పరిమితం కావచ్చు. కానీ, కొత్త ఉత్పత్తులతో యుటిలిటీ వాహనాల (యూవీ) వృద్ధి 10 శాతం స్థాయిలో దూసుకెళ్తుంది. మొత్తం అమ్మకాల పరిమాణంలోను, కొత్తగా వచ్చే మోడల్స్‌లోనూ యూవీల వాటా 68-70 శాతంగా ఉండనుంది' అని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనుజ్ సేథి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో దేశీ మార్కెట్ వాటా 85 శాతంగా ఉండగా, మిగతా వాటా ఎగుమతులది ఉంది.

**ఈవీల వృద్ధి 3.5 శాతానికి పరిమితం..**

- కొత్త మోడల్స్ ప్రవేశపెట్టినా, బ్యాటరీ ఖరీదు తగ్గినా అధిక రేట్లు, ఒక మోస్తరు చార్జింగ్ మౌలిక సదుపాయాలు, రేంజ్ (మైలేజీ) పరమైన అనుమానాల కారణంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) అమ్మకాల వృద్ధి 3-3.5 శాతానికి పరిమితం కావచ్చు. పట్టణ ప్రాంత యూజర్లు దీన్ని రెండో కారు కింద ఒక ఆప్షన్‌గా మాత్రమే పరిగణించవచ్చు. లో బేస్ కారణంగా గతేడాది ఈవీ సెగ్మెంట్ రెట్టింపయినప్పటికీ ఆ తర్వాత వృద్ధి నెమ్మదించింది.
- టెస్లా సహా గ్లోబల్ ఈవీ మోడల్స్ రావడం వల్ల ప్రీమియం సెగ్మెంట్లో పోటీ తీవ్రతరమవుతుంది. కస్టమర్ల అంచనాలు పెరిగిపోతాయి కాబట్టి దేశీ తయారీ సంస్థలు వేగవంతంగా కొత్త టెక్నాలజీలకు అప్‌గ్రేడ్ కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే, ప్రస్తుతం భారీ టారిఫ్‌లు ఉన్నందున దిగుమతులు వెల్లువెత్తకపోవచ్చు.
- రాబోయే రోజుల్లో వడ్డీ రేట్ల తగ్గింపు వేగం, ఈవీల వినియోగం, సరఫరావ్యవస్థపరమైన షాక్‌లు మొదలైనవి చిప్‌లు, బ్యాటరీ సెల్స్ లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది.
- అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితుల కారణంగా ఎగుమతులు 5-7 శాతానికి నెమ్మదించవచ్చు. మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో అమెరికా వాటా సుమారు 1 శాతమే కాబట్టి జూన్ నుంచి అమలయ్యే 25 శాతం టారిఫ్‌ల ప్రభావం పరిశ్రమపై పెద్దగా ఉండకపోవచ్చు. భౌగోళికరాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో వాహనాల కంపెనీలు ప్రత్యామ్నాయంగా మెక్సికో, గల్ఫ్ దేశాలు, దక్షిణాఫ్రికా, తూర్పు ఆసియా మార్కెట్లపై దృష్టి పెట్టొచ్చు.

# హైదరాబాద్‌లో భారీ బ్యాటరీ పరిశ్రమ



**హైదరాబాద్:** సిగ్ని ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ నగరంలో భారీ బ్యాటరీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఈమొబిలిటీ వ్యాలీలో తన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (BESS) గిగాఫ్యాక్టరీ మొదటి దశను ప్రారంభించి భారతదేశ క్లీన్ ఎనర్జీ రంగంలో కొత్త ఒరవడిని సృష్టించింది. ఇది దేశంలోనే మొదటి లీడ్ (LEED లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ డిజైన్) అర్హత పొందిన అత్యాధునిక ఫ్యాక్టరీ. 1,60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ పూర్తి ఆటోమేటెడ్ ఫ్యాక్టరీని రూ.100 కోట్ల పెట్టుబడితో స్థాపించారు. గ్రిడ్‌స్కేల్ స్టోరేజ్, ఎలక్ట్రిక్ వాహనాల (EV) కోసం 4.8 గిగావాట్ అవర్ల (GWh) బ్యాటరీ ప్యాక్‌లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఈ ఫ్యాక్టరీకి ఉంది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ కర్మాగారం క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించడంతోపాటు స్థానిక ఉద్యోగ అవకాశాలను సృష్టించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ప్రశంసించారు. ఇక ఫ్యాక్టరీ రెండవ దశ ఎలా ఉండనుందో సిగ్ని ఎనర్జీ వ్యవస్థాపకుడు, సీఈఓ వెంకట్ రాజారామన్ వెల్లడించారు. రెండో దశలో మరో రూ.150 కోట్ల పెట్టుబడితో ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 10.8 GWhకు విస్తరించనున్నట్లు చెప్పారు. 24 నెలల్లో పూర్తయ్యే ఈ విస్తరణ 1,000 పైగా ఉద్యోగాలను సృష్టించి, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయనుందని వివరించారు. ఈ గిగాఫ్యాక్టరీ మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ట్విన్ మోడలింగ్, స్మార్ట్‌గ్రిడ్ ఇంటిగ్రేషన్ వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగించి బ్యాటరీ పనితీరు, ఉత్పత్తి సామర్థ్యాన్ని ఆప్టిమైజ్ చేస్తుంది. సిగ్ని, ఐఐటీమద్రాస్‌తో భాగస్వామ్యం ద్వారా సోడియంఅయాన్ బ్యాటరీలు, సూపర్‌కెపాసిటర్ల వంటి తదుపరి తరం బ్యాటరీ పదార్థాలను అభివృద్ధి చేస్తోంది. ఇవి శక్తి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచడంతో పాటు అరుదైన పదార్థాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. 1 GWh ఆర్డర్ పైప్‌లైన్‌తో, సిగ్ని ఎనర్జీ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో గణనీయమైన ప్రభావాన్ని చూపనుంది.

# రంగులు మార్చే చాట్‌జీపీటీ

మాయాబజార్ సినిమా గుర్తుంది కదా. నిజానికి ఆ చిత్రాన్ని ముందుగా బ్లాక్ అండ్ వైట్‌లోనే రిలీజ్ చేశారు. కానీ కొన్నేళ్ల తర్వాత ఇటీవల దాన్ని కలర్ సినిమాగా మార్చి థియేటర్లలో విడుదల చేశారు. బ్లాక్ అండ్ వైట్ సినిమాను కలర్‌లోకి మార్చేందుకు ప్రత్యేకంగా ఓ యూనిట్ కొంతకాలం పని చేసింది. అయితే టెక్నాలజీ పెరుగుతున్న ఈ రోజుల్లో అలాంటి వ్యయప్రయాసలు అవసరం లేకుండా బ్లాక్ అండ్ వైట్ ఇమేజ్‌లను కలర్‌లోకి మార్చుకోవచ్చు. మీ తాతగారి ఫోటో.. నానమ్మ ఫోటో..వంటి మీ జ్ఞాపకంగా ఉన్న బ్లాక్ అండ్ వైట్ ఇమేజ్‌ను క్షణాల్లో కలర్‌లోకి చేంజ్ చేయవచ్చు. ఇందుకు చాట్‌జీపీటీ అవకాశం కల్పిస్తుంది. జనరేటివ్ ఏఐ అభివృద్ధి చెందుతూ సృజనాత్మక అవకాశాలను మునుపెన్నడూ లేనంత ముందుకు తీసుకెళ్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇమేజ్ ప్రాసెసింగ్‌లో తాజా పురోగతి ఇందుకు నిదర్శనం. జనరేటివ్ ఏఐ నమూనాలు మోనోక్రోమ్ చిత్రాలను అద్భుతమైన పూర్తి కలర్ వర్షన్లుగా మారుస్తున్నాయి. చాట్‌జీపీటీ జీబ్లీ ఇమేజ్ ప్రాసెసింగ్ ద్వారా ప్రత్యేకమైన ప్రాంప్ట్‌తో బ్లాక్ అండ్ వైట్ ఇమేజ్‌ను కలర్‌లోకి మార్చవచ్చని కంపెనీ తెలిపింది. కలర్‌లోకి ఎలా మార్చాలంటే.. వినియోగదారులు చాట్‌జీపీటీ జీబ్లీలో బ్లాక్ అండ్ వైట్ చిత్రాన్ని అప్‌లోడ్ చేయాలి. 'Convert this black and white image to color' అనే ప్రాంప్ట్ అందించాలి.

# ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు.. బజాజ్ షేర్లకు గట్టి దెబ్బ!



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. బెంచ్ మార్క్ సూచీలు స్వల్ప శ్రేణిలో కన్సాలిడేట్ కావడంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్ లోనూ స్టాక్ స్పెసిఫిక్ ట్రేడింగ్ కార్యకలాపాలు జోరందుకున్నాయి. గురువారం (మే 1) ట్రేడింగ్ హాలిడే నేపథ్యంలో ట్రేడింగ్ కార్యకలాపాలు మందకొడిగా సాగాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 80 పాయింట్ల లాభంతో 80,371 వద్ద ప్రారంభమై, ఆ తర్వాత ట్రేడింగ్లో ఎక్కువ భాగం కన్సాలిడేట్ అయింది. ట్రేడింగ్ చివరి 30 నిమిషాల్లో 80,526 (237 పాయింట్లు పెరిగింది) వద్ద గరిష్టానికి చేరుకుంది. కాని వెంటనే లాభాలను కోల్పోయి 79,879 వద్ద కనిష్టానికి పడిపోయింది. రోజులో గరిష్ట స్థాయి నుండి 647 పాయింట్లు పడిపోయింది. చివరకు సెన్సెక్స్ 46 పాయింట్ల నష్టంతో 80,0242 వద్ద ముగిసింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 2,827 పాయింట్లు (3.6 శాతం) లాభంతో ఏప్రిల్ నెలను ముగించింది. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇండెక్స్ దాదాపు 200 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. 24,396 వద్ద గరిష్టాన్ని తాకింది. తరువాత 24,199 వద్ద కనిష్టానికి పడిపోయింది. చివరకు రెండు పాయింట్ల నష్టంతో 24,334 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఏప్రిల్ నెలలో 3.5 శాతం లేదా 815 పాయింట్లు లాభపడింది. సెన్సెక్స్ 30 స్టాక్స్‌లో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు 5 శాతానికి పైగా నష్టపోయాయి. టాటా మోటార్స్, ఎస్‌బీఐ 3 శాతం చొప్పున నష్టపోయాయి. అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు కూడా నష్టపోయాయి. మారుతీ మాత్రం 3 శాతానికి పైగా లాభపడింది. భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు కూడా 1 2 శాతం చొప్పున లాభపడ్డాయి.




# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



# అప్పు ఇవ్వొద్దు.. పాక్‌పై భారత్ ఆర్థిక యుద్ధం



**ఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడితో ప్రతీకారంతో రగిలిపోతున్న భారత్ .. పాకిస్తాన్‌ను ఆర్థికంగా మరింత ఇబ్బందే పెట్టే ప్రయత్నాల్ని ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా దాయాది దేశంపై భారత్ ఆర్థిక యుద్ధం ప్రకటించింది. wపాకిస్తాన్‌కు అప్పు ఇవ్వొద్దంటూ భారత్ అంతర్జాతీయ ద్రవ్య నిధి (International Monetary Fund IMF) పై ఒత్తిడి చేస్తోంది. ఆ మేరకు అభ్యంతరం తెలిపింది. గతేడాదిలో ప్రకటించిన పాకిస్తాన్‌కు ఏడు బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజీ విషయంలో సమీక్షించాలని కోరింది. పాక్‌కు నిధులు ఇస్తే ఉగ్రవాదులకు మళ్ళిస్తోందని ఐఎఎఫ్ మెంబర్స్‌కు భారత్ వివరిస్తోంది. మే 9న పాకిస్తాన్‌కు అప్పు ఇచ్చే అంశంపై ఐఎంఎఫ్ బోర్డు చర్చించనుంది. ఈ తరుణంలో పాక్‌కు ఎట్టి పరిస్థితుల్లో అప్పు ఇవ్వొదని భారత్ వాదిస్తోంది. ఇదే అంశంపై భద్రతామండలి నాన్ పర్మినెంట్ మెంబర్స్‌తో భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ చర్చలు జరుపుతున్నారు. పాకిస్తాన్‌కు ఏడు బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజీని సమీక్షించాలని కోరనున్నారు.

# చిగురిస్తున్న ఇండో-కెనడా స్నేహం

## కెనడాలో భారత హై కమిషనర్ దినేష్ కుమార్ పట్నాయక్!

### పట్టాలెక్కనున్న దౌత్య సంబంధాలు.. కెనడాలో మార్క్ కార్నీ మైనారిటీ ప్రభుత్వం!



భారత్‌కెనడా మధ్య సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ స్నేహం కొత్త చివుళ్లు వేస్తోందా? ఏడాదిన్నర కాలానికి పైగా గాడి తప్పిన భారత్, కెనడా దౌత్య సంబంధాలు పట్టాలెక్కబోతున్నాయా... అంటే అవుననే చెప్పాలి. కెనడా సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన లిబరల్ పార్టీ నేత, ఆ దేశ ప్రస్తుత తాత్కాలిక ప్రధాని, కాబోయే పూర్తికాలపు ప్రధాని మార్క్ కార్నీకి భారత్ ప్రధాని మోదీ పంపిన అభినందన సందేశానికి సంకేతం అదే. మార్క్ కార్నీకి ముందు కెనడా ప్రధానిగా జస్టిన్ ట్రూడో ఉన్నప్పుడు గత అక్టోబరులో రెండు దేశాలూ పరస్పరం హై కమిషనర్లను బహిష్కరించాయి. ఈ ఏడాది జూన్ మాసానికల్లా హై కమిషనర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని ఉభయ దేశాలు తలపోస్తున్నాయి. ప్రస్తుతం 'స్పెయిన్'లో భారత రాయబారిగా వ్యవహరిస్తున్న దినేష్‌కుమార్ పట్నాయక్ ను కెనడాలో తదుపరి హై కమిషనరుగా భారత్ నియమించే అవకాశముందని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ త్వరలో ఆరంభమవనుందని తెలుస్తోంది. కెనడా ఎన్నికల ఓట్ల లెక్కింపు దాదాపు పూర్తయింది. 343 స్థానాలున్న పార్లమెంటు దిగువ సభలో లిబరల్ పార్టీ 168 సీట్లు, కన్జర్వేటివ్ పార్టీ 144 సీట్లు గెలుచుకున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు పూర్తి మెజారిటీ రావాలంటే లిబరల్ పార్టీ 172 సీట్లు గెలవాలి. కానీ ఆ మేజిక్ నంబరుకు కొద్ది దూరంలో అది ఆగిపోయింది. చిన్న పార్టీల సహకారంతో లిబరల్ పార్టీ మైనారిటీ సర్కారు ఏర్పాటు చేసే అవకాశముంది. ఖలిస్థాన్ వేర్పాటువాద నేత హరదీప్ సింగ్ నిజ్జర్ 2023లో కెనడాలో హత్యకు గురయ్యాడు. భారత ప్రభుత్వ ఏజెంట్లే అతడిని హతమార్చారని కెనడా ఆరోపించడంతో ఆ దేశంతో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి. తదనంతర పరిణామాల్లో కెనడాలో భారత హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మను కెనడా వెళ్లగొట్టడం, ప్రతిగా కెనడా దౌత్యవేత్తలను ఇండియా బహిష్కరించడం చకచకా జరిగిపోయాయి. దరిమిలా చాలినంత మంది దౌత్యవేత్తలు లేక కెనడా కాన్సులేట్లు మూతపడ్డాయి. నాటి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో పదవి నుంచి దిగిపోయారు. మరోవైపు కెనడా ఎన్నికల్లో ఖలిస్థాన్ సానుకూల నేత, న్యూ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షుడు జగ్మీత్ సింగ్ కూడా ఓటమి పాలయ్యాడు. ఈ రెండు పరిణామాలు ఇండోకెనడా బంధం మళ్లీ మొగ్గ తొడిగేందుకు పరిస్థితులను అనుకూలంగా మార్చాయి. ట్రూడోలా కాకుండా మార్క్ కార్నీ మరింత పరిణతితో వ్యవహరిస్తారని భారత్ అభిప్రాయపడుతోంది.

# చిన్మయ్ కృష్ణదాస్‌కు ఊరట



**ఢాకా:** ఇస్కాన్ మాజీ ప్రతినిధి, బంగ్లాదేశ్‌లో మైనారిటీ హక్కుల సాధన ఉద్యమకారుడు చిన్మయ్ కృష్ణదాస్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. బంగ్లాదేశ్ హైకోర్టు బుధవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. రాజద్రోహం కేసులో కిందటి ఏడాది నవంబర్‌లో ఆయన్ని బంగ్లాదేశ్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ గతేడాది నవంబరులో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడ బంగ్లా జాతీయజెండాను అగౌరవపరిచారనే అభియోగాలపై 2024 నవంబరు 25న ఢాకా హజారత్ షాహ్‌జలాల్ ఎయిర్‌పోర్టులో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అనంతరం జైలుకు తరలించారు. ఆయన తరపున వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను సైతం అక్కడి ఆందోళనకారులు అనుమతించలేదు. చివరకు చిన్మయ్ భాగస్వామిగా ఉన్న బంగ్లాదేశ్ సమ్మిళిత సనాతన జాగరణ్ జోతే అనే సంస్థ.. 11 మందితో లాయర్ల బృందాన్ని ఏర్పాటుచేసింది. అయినా కూడా ఆయనకు బెయిల్ దక్కలేదు. మరోవైపు భారత్ సహా అంతర్జాతీయ సమాజం చిన్మయ్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించింది. శాంతియుతంగా నిరసన తెలిపే మైనారిటీల హక్కులను కాలరాయడం సరికాదంటూ భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. చిన్మయ్ కృష్ణదాస్ స్వస్థలం చిట్టాగాంగ్‌లోని సట్కానియా ఉపజిల. 20162022 మధ్య ఇస్కాన్ చిట్టాగాంగ్ డివిజనల్ సెక్రటరీగా దాస్ పని చేశారు. ఆపై హిందూ మైనారిటీల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పడిన బంగ్లాదేశ్ సమ్మిళిత సనాతన జాగరణ్ జోతే తరపున ప్రతినిధిగా దాస్ పని చేశారు. సనాతన ధర్మ పరిరక్షకుడిగా ఆయనకంటూ అక్కడ ఓ పేరుంది. బంగ్లా మీడియా ఆయన్ని శిశు బోక్తాగా అభివర్ణిస్తుంటుంది. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో పాటు మైనారిటీ ప్రొటెక్షన్ లా తేవడంంలోనూ దాస్ కృషి ఎంతో ఉంది. కిందటి ఏడాది.. అక్టోబర్ 25న చిట్టాగాంగ్‌లో, నవంబర్ 22వ తేదీన రంగ్‌పూర్‌లో ఆయన నిర్వహించిన ర్యాలీలు దేశవ్యాప్త చర్చకు దారి తీశాయి. చిట్టాగాంగ్‌లో నిర్వహించిన ర్యాలీలో బంగ్లాదేశ్ జాతీయ జెండాకు పైన కాషాయ జెండాను ఎగరేయడంతోనే ఆయనపై రాజద్రోహం కేసు నమోదు అయ్యింది.

# ప్రిన్స్ హ్యారీతో విడాకులా? తొలిసారి మౌనం వీడిన మేఘన్



ప్రిన్స్ హ్యారీ (Prince Harry), మేఘన్ మార్కెల్ (Meghan Markle ) వివాహం ప్రపంచంలోనే అత్యధికమంది వీక్షించిన రాయల్ వెడ్డింగ్‌గా నిలిచింది. అయితేఈ దంపతులు విడిపోతున్నారనే ఊహాగానాలు బాగా వ్యాపించాయి. ఈ వార్తలను మేఘన్ మార్కెల్ తొలిసారి క్లారిటీ ఇవ్వడం విశేషం. తన భర్త మనసు చాలా మంచిదనీ, చాలా చాలా అందగాడని చెప్పుకొచ్చింది. ఇంకా వారి వివాహ బంధంపై ఆమె చెప్పిందో వివరాలను తెలుసుకుందాం. 2018, మే 19న యూకేలోని విండ్సర్ కాజిల్‌లోని సెయింట్ జార్జ్ చాపెల్‌లో అత్యంత ఘనంగా వీరి వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. బ్రిటిష్ రాచరికంలో సంచలన మార్పును ప్రకటించారు. 2020లో తాము తమ రాజ విధుల నుండి తప్పుకున్నట్లు ప్రకటించి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఆ తరువాత ప్రిన్స్‌హ్యారీ, మేఘన్ విడిపోతున్నారనే వార్తలు జోరుగా వ్యాపించాయి. చాలా రోజుల తరువాత మేఘన్ మార్కెల్ భర్త ప్రిన్స్ హ్యారీతో తన అందమైన బంధాన్ని పంచుకుంది. తన స్నేహితురాలు, IT కాస్మెటిక్స్ CEO జామీ కెర్న్ లిమా పాడ్‌కాస్ట్‌లో ది జామీ కెర్న్ లిమా షో. చిట్‌చాట్‌లో మేఘన్ మార్కెల్ మౌనం వీడి కొన్ని ఆసక్తికర సంగతులను పంచుకుంది. ఏడేళ్ల సుదీర్ఘ వివాహ బంధంలో తమ ప్రయాణాన్ని ఆనందంగా కొనసాగిస్తున్నామని తెలిపింది. అంతేకాదు తమ బంధాన్ని 1985 నాటి ప్రముఖ వీడియో గేమ్ సూపర్ మారియో బ్రదర్స్‌తో సరదాగా పోల్చారు. తన భర్త ప్రిన్స్ హ్యారీ చాలా, చాలా అందగాడని కితాబిచ్చింది. అతనికి చాలా మంచి హృదయం ఉన్నవాడని, తనను చాలా ప్రేమిస్తున్నాడని వెల్లడించింది. ఇద్దరం కలిసి ఒక అందమైన జీవితాన్ని నిర్మించు కున్నాం, ఇద్దరు అందమైన పిల్లలున్నారు. మాది చాలా హ్యాపీ ఫ్యామిలీ అంటూ చెప్పుకొచ్చింది. అదే పాడ్‌కాస్ట్‌లో, మేఘన్ మార్కెల్ డేటింగ్ , ప్రారంభ రోజులు ఎలా ఉన్నాయో కూడా వివరించింది. కాలక్రమేణా, ప్రతి సంబంధం అభివృద్ధి చెందుతుందని, అందుకే ఇదిఒకరికొకరు సహవాసాన్ని కొత్త మార్గంలో ఆస్వాదించడం లాంటిదని పేర్కొంది. హ్యారీతో ఆమె శాశ్వత ప్రయాణం ఇంకా కొనసాగుతుందా అని అడిగినప్పుడు 'అవును' అని స్పష్ట చేసింది మేఘన్. " మీకో విషయం తెలుసా? మా బంధం ప్రారంభంలో సీతాకోక చిలుకల్లా విహరించాం. ఆరు నెలల డేటింగ్ తరువాత పెళ్లి అనే బంధంలోకి వెళ్లాం. ఈ ఏడేళ్ల కాలం ఒకరినొకరు కొత్త మార్గంలో ఆనందిస్తున్నాం. మరో విధంగా చెప్పాలంటే ఇది మాకు హనీమూన్ కాలంలా అనిపిస్తుంది." అని మేఘన్ మార్కెల్ చెప్పడం విశేషం. 2016లో, ఈ జంట తొలి సారు కలుసుకున్నారు. 2018లో పెళ్లి తరువాత, 2019లో తొలి బిడ్డ ప్రిన్స్ ఆర్చీని, 2021లో తమ రెండవ బిడ్డ ప్రిన్సెస్ లిలిబెట్‌ను స్వాగతించారు. ప్రస్తుతం, రాజ దంపతులు పిల్లలతో కలిసి అమెరికాలో ఉంటున్నారు.

# రాధికా ఆప్టే బోల్డ్ మూవీ
# ది వెడ్డింగ్ గెస్ట్ రివ్యూ

**రాధికా ఆప్టే.. అందం, నటనతో ఆకట్టుకునే నటి. తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో తన ప్రతిభను చాటుతూ, 'ది వెడ్డింగ్ గెస్ట్' సినిమాతో హాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా 2019లో విడుదలైంది. ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా కథేంటి? ఎలా ఉంది? రివ్యూలో చూద్దాం.**



ఫ్రెండ్ కోసం పెళ్లికూతుర్ని కిడ్నాప్ చేసి తీసుకొచ్చే హీరోలు తెలుగు తెర మీద చాలా మందినే చూశాం. ఈ సినిమాలో హీరో మాత్రం పెళ్లికూతురిని కిడ్నాప్ చేసేది ఫ్రెండ్ కోసం కాదు డబ్బు కోసం. జై (దేవ్ పటేల్) అనే లండన్ వాసి పాకిస్తాన్ లోని లాహోర్ సమీపంలో ఉన్న యోంగానా బాద్ అనే గ్రామానికి చేరుకుంటాడు. అంతకు ముందే తనను ఎవరూ గుర్తించకుండా, సిమ్ కార్డులు, కార్లు మార్చుకుంటూ అక్కడ దాకా వస్తాడు. ఆ తర్వాత రెండు గన్స్ ను కొనుగోలు చేస్తాడు. ఆ గ్రామానికి వచ్చాక పెళ్లికి రెడీ అవుతున్న సమీరా (రాధికా ఆప్టే) అనే యువతిని కిడ్నాప్ చేస్తాడు. ఆ క్రమంలో అడ్డొచ్చిన సెక్యూరిటీ గార్డ్‌ని హత్య చేయాల్సి వస్తుంది. ఆమెను దేశం దాటించి తీసుకువెళ్లడానికి ముందు...ఆమె ప్రేమికుడు దీపేశ్ (జిమ్ సర్భ్) తనతో కాంట్రాక్ట్ కుదుర్చుకుని ఈ పనిచేయించాడనే విషయం జై బయటపెడతాడు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి మారుపేర్లతో, దొంగ పాస్‌పోర్ట్‌లతో ఇండియాకు వస్తారు. అయితే సెక్యూరిటీ గార్డ్ హత్య కారణంగా ఈ కిడ్నాప్ రెండు దేశాల మీడియాలో వైరల్ అవుతుంది, దాంతో సమీరా ప్రేమికుడు దీపేశ్ భయపడతాడు, సమీరాను తిరిగి పాకిస్తాన్‌కు పంపేయమని దేవ్‌ని కోరతాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల పాటు సన్నిహితంగా గడిపిన జై, సమీరా మధ్య అనుబంధం పెరుగుతుంది. ముఖ్యంగా సమీరా అతనిపై మోజుపడుతుంది. వారిద్దరూ శారీరకంగా ఒకటవుతారు. అదే సమయంలో దీపేశ్ దగ్గర ఖరీదైన వజ్రాలు ఉన్నాయని తెలుసుకున్న జై, వాటిని పొందేందుకు ప్రయత్నిస్తాడు. రకరకాల మలుపుల మధ్య సాగే ఈ లవ్-క్రైమ్-రొమాంటిక్ కథ చివరికి ఏ మలుపు తిరుగుతుందనేది ఆసక్తికరంగా ఉంటుంది.

జై పాత్రలో మిస్టీరియస్ ప్రొఫెషనల్ కిల్లర్‌గా జై పూర్తి గా మెప్పిస్తాడు. బోల్డ్ సీన్లకు పెట్టింది పేరైన రాధికా ఆప్టే(తెలుగులో లెజెండ్‌లో బాలకృష్ణ సరసన హీరోయిన్) ఈ సినిమా హాలీవుడ్ రూపకర్తల సమర్పణలో రావడంతో...పూర్తి స్థాయి హాలీవుడ్ హీరోయిన్‌లా రెచ్చిపోయిందని చెప్పొచ్చు. ముఖ్యంగా ఇంటిమేట్ సీన్లలో ఆమె దాదాపు పూర్తి న్యూడ్‌గా కనిపించడం విశేషం.హాలీవుడ్ చిత్రం చేసినప్పటికీ మన ఇండియన్ హీరోయిన్లు మరెవ్వరూ ఈ స్థాయిలో బోల్డ్ సీన్స్ చేసి ఉండరు... సమీరా పాత్ర భావోద్వేగాలను కూడా బాగా ప్రదర్శించింది. ఆకట్టుకునే సినిమాటోగ్రఫీ మరో ఆకర్షణ. పాకిస్తాన్, ఇండియా మధ్య ప్రయాణం, మారుమూల ప్రాంతాల చిత్రీకరణ బాగా చూపించారు. సంగీత పరంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ థ్రిల్లింగ్ మూమెంట్లను ఎలివేట్ చేస్తుంది. అక్కడక్కడా సాగదీసినట్టు అనిపించినా.. ఆ ఫీలింగ్ ముదరకముందే ఆసక్తికరమైన మలుపులు పేర్చుకుంటూ రావడం వల్ల ఎక్కడా బోర్ కొట్టదు. ఐఎమ్‌డిబి 6.0 రేటింగ్ ఇచ్చిన ఈ సినిమా ఓ కాలక్షేపం యాక్షన్, థ్రిల్లర్, లవ్, రొమాంటిక్ సీన్లను ఇష్టపడే వారికి తప్పకుండా నచ్చుతుంది. చూడాలనుకున్నవారు నెట్‌ఫ్లిక్స్‌లో చూడవచ్చు.

# స్పిరిట్ వెనక్కి..
## సందీప్‌కి ట్విస్ట్ ఇచ్చిన ప్రభాస్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కొన్నేళ్లపాటు ఫుల్ బిజీ! ఇప్పటికే ఆయన అరడజను సినిమాల వరకు బాకీ ఉన్నాడు. వాటిల్లో ముందుగా రాబోయేది మారుతి దర్శకత్వం వహిస్తున్న 'రాజాసాబ్' సినిమా. పిపుల్స్ మీడియా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. దీని తర్వాత ప్రభాస్ హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ'(ప్రచారంలో ఉన్న టైటిల్) చేయబోతున్నాడు. ఆ తర్వాత యానిమల్ ఫేం సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్'(Spirit) చేయాల్సింది. ఈ రెండు పూర్తయిన తర్వాత నాగ్ అశ్విన్, ప్రశాంత్ నీల్‌తో పాటు యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మతో కూడా సినిమా చేయాలి. కానీ ఇప్పుడు ఈ ఆర్డర్ మారినట్లు తెలుస్తోంది. 'స్పిరిట్'ని వెనక్కినెట్టి ప్రశాంత్ వర్మ సినిమా చేయడానికి ప్రభాస్ రెడీ అవుతున్నాడని టాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

**'స్పిరిట్'కి బ్రేక్‌కి కారణం ఏంటి?**

సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్' స్క్రిప్ట్‌ను పూర్తి చేసి, లొకేషన్లు కూడా ఫైనల్ చేస్తున్నాడు. కానీ, ఈ సినిమా కోసం సందీప్ విధించిన కండీషన్లే ప్రభాస్‌ను కాస్త వెనకడుగు వేయించాయని టాక్. 65 రోజుల వరుస కాల్షీట్స్, డూప్ లేకుండా యాక్షన్ సీన్స్ చేయాలన్న సందీప్ షరతులకు ప్రభాస్ మొదట ఓకే చెప్పినప్పటికీ, ఇప్పుడు మాత్రం ప్రశాంత్ వర్మ సినిమాను ప్రాధాన్యతగా తీసుకున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ భోర్సే నటించనుందని బజ్.

**డబుల్ షూటింగ్‌తో బిజీ!**

'రాజాసాబ్' షూటింగ్ పూర్తయిన వెంటనే హను రాఘవపూడి 'ఫౌజీ'తో పాటు, ప్రశాంత్ వర్మ సినిమా షూటింగ్‌లోనూ ప్రభాస్ పాల్గొననున్నాడట. ప్రస్తుతం ఇటలీ టూర్‌లో ఉన్న ప్రభాస్, తిరిగి వచ్చిన తర్వాత ఈ విషయంపై క్లారిటీ రానుంది. మరి, ఈ షెడ్యూల్ మార్పు వెనుక అసలు కథేంటో తెలియాలంటే, మరికొన్ని రోజులు ఆగాల్సిందే!

# ఇంత చెత్తగా ఆలోచిస్తారా?





బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్ నాగిని సీరియల్‌తో సౌత్‌లో ఫేమస్ అయింది. బాలీవుడ్‌లో పలు సూపర్ హిట్ సీరియల్స్‌లో నటించిన ముద్దుగుమ్మ.. ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ది భూత్నీ అనే హారర్ మూవీలో కనిపించనుంది. ఈ చిత్రంలో సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ మే 1వ తేదీన థియేటర్లలో సందడి చేయనుంది. ఎప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్.. ఎక్కడికెళ్లినా తన ఫోటోలు, వీడియోలను అభిమానులతో షేర్ చేస్తూ ఉంటుంది. అయితే ఈ ముద్దుగుమ్మపై ఎప్పుడు ఏదో ఒక రూమర్స్ వినిపిస్తూనే ఉంటాయి. గ్లామర్ కోసం చాలాసార్లు సర్జరీ చేయించుకుందని సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోల్స్ వచ్చాయి. ఆమె కాస్మెటిక్ సర్జరీ చేయించుకుందని.. దాన్ని కవర్ చేసేందుకు తన హెయిర్‌స్టైల్‌ను మార్చుకుందని నెటిజన్స్ విమర్శించారు.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో తనపై వస్తున్న ట్రోల్స్‌పై బాలీవుడ్ భామ స్పందించింది. ఇలాంటి వారిని చూసినప్పుడు తనకు జాలేస్తుందని చెప్పుకొచ్చింది. మౌనీ రాయ్ మాట్లాడుతూ.. 'నేను అలాంటి వ్యాఖ్యలను చదివినప్పుడు.. కొన్నిసార్లు ఏఐ వీడియోలను చూసినప్పుడు చాలా భయంకరంగా అనిపిస్తుంది. మీరు ఇతరులను అలా చూడటం ఎలా అనిపిస్తుందో ఒక్కసారి ఊహించుకోండి. నా ముఖాన్ని ఇతరుల శరీర ఆకృతిపకి జత చేసి వక్రీకరించడం చూస్తే అది చాలా అసహ్యంగా అనిపించింది.

## క్రీడా వార్తలు SPORTS NEWS

### ఐపీఎల్-2025 నుంచి మాక్స్‌వెల్ ఔట్..



ఐపీఎల్ 2025లో ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్, పంజాబ్ కింగ్స్ ఆటగాడు గ్లెన్ మాక్స్‌వెల్ ప్రయాణం ముగిసింది. చేతి వేలి గాయం కారణంగా ఈ ఏడాది సీజన్ మధ్యలోనే మాక్స్‌వెల్ వైదొలిగాడు. ప్రాక్టీస్ సెషన్‌లో మాక్స్‌వెల్ చేతి వేలికి ఫ్రాక్చర్ అయింది. ఈ విషయాన్ని సీఎస్‌కేతో మ్యాచ్ సందర్భంగా పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ధ్రువీకరించాడు. టాస్ సమయంలో అయ్యర్ మాట్లాడుతూ..దురదృష్టవశాత్తూ మాక్స్‌వెల్ చేతి వేలికి ఫ్రాక్చర్ అయింది. నిజంగా మాకు ఇది గట్టి ఎదురుదెబ్బ. అతడి స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలన్నది ఇంకా నిర్ణయించలేదు అని పేర్కొన్నాడు. మాక్స్‌వెల్ ప్రస్తుతం జట్టుతో పాటు ఉన్నప్పటికి త్వరలోనే తన స్వదేశానికి పయనం కానున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ ఏడాది సీజన్‌లో మాక్స్‌వెల్ దారుణ ప్రదర్శన కనబరిచాడు. బౌలింగ్‌లో ఒకట్రెండు వికెట్లు పడగొట్టినప్పటికి, బ్యాటింగ్‌లో మాత్రం పూర్తిగా తేలిపోయాడు. మాక్స్‌వెల్ 6 ఇన్నింగ్స్‌లలో 8.00 సగటు కేవలం 48 పరుగులు మాత్రమే చేశాడు.



# పంజాబ్ సంచలన విజయం
## ఇంటి దారి పట్టిన ధోనీ సేన

**మహా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 టోర్నమెంట్ లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ గ్రాండ్ విక్టరీ కొట్టింది. అందరూ ముందుగా అంచనా వేసినట్టే... చెన్నై సూపర్ కింగ్స్ జట్టు మరో ఓటమిని మూటగట్టుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై ఏకంగా పంజాబ్ కింగ్స్ 4 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. ఈ మ్యాచ్ లో మొదటి బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు... 19.2 ఓవర్లలో 190 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అయితే 191 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో... ఆచితూచి ఆడింది పంజాబ్ కింగ్స్. ఈ నేపథ్యంలోనే 19.4 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని చేదించింది పంజాబ్ కింగ్స్. దీంతో నాలుగు వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది.

**అయ్యర్ అదుర్స్**

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై.. చేజింగ్ చేసే క్రమంలో పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రభ సిమ్రాన్, ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా ఆడారు. శ్రేయస్ అయ్యర్ 72 పరుగులు చేయగా, ప్రభ సిమ్రాన్ 54 పరుగులతో దుమ్ము లేపాడు. ఈ ఇద్దరు చివరి వరకు మ్యాచ్ తీసుకువెళ్లారు. ఏ మాత్రం చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లకు ఛాన్స్ ఇవ్వకుండా... రఫ్ ఆడించారు. అయితే ఈ ఇద్దరు ప్లేయర్లు చివరలో ఔట్ కావడంతో మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు కాస్త స్ట్రగుల్ అయ్యారు. మహేంద్ర సింగ్ ధోని ఎత్తుగడలకు కాస్త వణికిపోయారు. అయినప్పటికీ చేయాల్సిన పరుగులు తక్కువగా ఉండటంతో.. పంజాబ్ కింగ్స్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇక ఓటమితో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్లే ఆఫ్స్ ఆశలను దూరం చేసుకుంది.



# చెంప దెబ్బ వివాదం..
## వాళ్లిద్దరూ మంచి ఫ్రెండ్స్: కేకేఆర్


ఐపీఎల్ 2025లో మంగళవారం అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 14 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచ్ అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్.. కేకేఆర్ స్టార్ బ్యాటర్ రింకూ సింగ్‌ను చెంపదెబ్బ కొట్టడం వివాదస్పదమైంది. అప్పటివరకూ సరదాగా నవ్వుతూ మాట్లాడుతున్న రింకూ.. కుల్దీప్ చర్యతో ఒక్కసారిగా షాక్ అయ్యాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కుల్దీప్ ప్రవర్తనను చాలా మంది తప్పుబట్టారు. కుల్దీప్‌పై బీసీసీఐ కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ వివాదానికి కోల్‌కతా ఫ్రాంచైజీ ఫుల్‌స్టాప్ పెట్టింది. మీడియాలో వస్తున్న వార్తలను కేకేఆర్ ఖండించింది. యూపీకి చెందిన వీరిద్దరూ మంచి స్నేహితులంటూ.. గతంలో కుల్దీప్, రింకూ కలిసి ఉన్న ఫోటోలను వీడియో రూపంలో కేకేఆర్ షేర్ చేసింది. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ కూడా ఈ వివాదంపై స్పందించింది. కుల్‌దీప్ యాదవ్, రింకు సింగ్ ఇద్దరూ హార్ట్ సింబల్స్‌తో ఫోజ్ ఇస్తున్న వారి వీడియోను షేర్ చేసింది. ఆ వీడియోకు 'ఓన్లీ ప్యార్' అనే క్యాప్షన్ ఇచ్చింది. దీంతో ఈ చెంప వివాదానికి తెరపడినట్లే. కాగా ఈ మ్యాచ్‌లో రింకూ సింగ్ 36 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడగా.. కుల్దీప్ మాత్రం ఒక్క వికెట్ కూడా సాధించలేకపోయాడు.


# ఈసారైనా కప్ వచ్చేలా చూడు స్వామి.. తిరుమలలో ఆర్సీబీ కెప్టెన్ పూజలు

ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జోరు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ.. 7 విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆర్సీబీ తమ తదుపరి మ్యాచ్‌లో మే 3న చిన్నస్వామి స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ఇంకా మూడు రోజుల సమయం ఉండడంతో ఆర్సీబీ కెప్టెన్ రజిత్ పాటిదార్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బుధవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో పాటిదార్ తన సహచర ఆటగాడు జితేష్ శర్మ, టీమిండియా మహిళా క్రికెటర్ శ్రేయంకా పాటిల్‌తో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఈ క్రికెటర్లను ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. కాగా ఆర్సీబీ కెప్టెన్‌గా తొలిసారి బాధ్యతలు చేపట్టిన పాటిదార్ జట్టును అద్భుతంగా నడిపిస్తున్నాడు. బ్యాటింగ్, కెప్టెన్సీతో ఆకట్టుకుంటున్నాడు పాటిదార్. అతడితో పాటు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సైతం అదరగొడుతున్నాడు. వరుస హాఫ్ సెంచరీలతో ఆర్సీబీ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. బెంగళూరు మరో రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే తమ ప్లే ఆఫ్ బెర్త్‌ను ఖారారు చేసుకుంటుంది.

**సీఎస్‌కేతో మ్యాచ్‌కు ఆర్సీబీ తుది జట్టు(అంచనా)**

విరాట్ కోహ్లీ, జాకబ్ బెథెల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, రొమారియో షెఫర్డ్, భువనేశ్వర్ కుమార్, సుయాష్ శర్మ, జోష్ హేజిల్‌వుడ్, యశ్ దయాల్





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com



### రాజేంద్రనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంట్
## ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్ జర్నలిస్ట్ ల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం విజేత లకు బహుమతి ప్రధానోత్సవం లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు ఇటువంటి క్రీడా పోటీలు వల్ల శారీరక దేహదారుడ్యము,మానసిక ప్రశాంతత కలుగుతుంది అన్నారు. కుటుంబ సభ్యులతో కల్సి ఇలా క్రికెట్, అట లపోటీలు నిర్వహిచ్కోవటం చాలా సంతోషం అన్నారు. జర్నలిస్టులకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు.కార్యక్రమం లో స్థానిక నాయకులు శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు

### పదవ తరగతి ఫలితాలలో విశ్ర విద్యాసంస్థల
# విద్యార్థుల విజయ దుందుభి

**ఉపాధ్యాయుల, విద్యార్థుల సహకారంతో ఉత్తమ ఫలితాలు**
**విశ్ర విద్యా సంస్థల డైరెక్టర్ దోర్బల హరిహరనాథ శర్మ**



**రంగా రెడ్డి జిల్లా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికం గా ప్రకటించిన 10వ తరగతి ఫలితాల లో విశ్ర విద్యా సంస్థల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. బాలాపూర్ చౌరస్తా ఉన్న విశ్ర స్కూల్ గడిచిన మూడు సంవత్సరాల లో రెండు సార్లు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని విశ్ర విద్యా సంస్థల డైరెక్టర్ దోర్బల హరిహరనాథ శర్మ,ప్రిన్సిపాల్ దూడపాక సురేష్ తెలియజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల యజమాన్యం ఘనంగా సన్మానించింది. 500 పైన మార్కులను 20 మంది విద్యార్థులు సాధించారు అని,సబ్జెక్టులు వారిగా ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించడం లో అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బందికి,విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు విశ్రా విద్యా సంస్థల యజమాన్యం అభినందనలు తెలియజేశారు. ప్రశాంతమైన వాతావరణంలో,అనుభవజ్ఞులైన అధ్యాపకుల బృందం తో ఈ ఫలితాలు సాధ్యపడ్డాయని యజమాన్యం తెలిపింది. ఉత్తమ ఫలితాలు సాధించడానికి అధ్యాపకులు ఎంతగానో కృషి చేశారని వారి ప్రోత్సాహం,సహకారం తో ఫలితాలు సాధించడం జరిగిందని విద్యార్థులు తెలిపారు. అధ్యాపకుల సూచనలను వింటూ వారి మార్గదర్శనం లో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించామని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఫలితాల లో సిద్ధార్థ సింహ ఆర్యా 581,జీవన్ బాలాజీ 577, మనోహర్ 562,మయాంక్ 562,దీక్షిత 552,అక్షిత రెడ్డి 549,భాను 548,సచిన్ 547,రోహన్ చవన్ 545, సంహిత 542, సాయి భరత్ గౌడ్ 542, మరి కొంత మంది ఉత్తమ మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు,అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయి

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్ మహా:** తెలంగాణ భూ భారతి ఆర్ఓఆర్ కొత్త చట్టం అవగాహన సదస్సును బుధవారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ ఇన్స్ ట్యూట్ ఆఫ్ రూలర్ డెవలప్మెంట్ కార్యాలయంలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. పెండింగ్ లో ఉన్న సాదా బై నామ, వివిధ భూ సమస్యలు పరిష్కారం అవుతాయి. తెలంగాణ ప్రభుత్వం భూ భారతి చట్టం ద్వారా ఏర్పాటు చేసిన ఆర్ఓఆర్ చట్టంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ డివిజన్ అధికారి వెంకట్ రెడ్డి, ఎమ్మార్వో రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్ మహా:** రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ ఇన్స్టిట్యూట్ రూలర్ డెవలప్మెంట్ కార్యాలయంలో బుధవారం 564 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆడపిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు సహాయంగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ద్వారా చేయూతనిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోని ఆర్థికంగా లబ్ధిపొందాలన్నారు. పేదింటి ఆడపిల్లల వివాహానికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో లబ్ధిచేకూరుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరెడ్డి, ఎమ్మార్వో రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

### పది ఫలితాల్లో సత్తా చాటిన
# ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు



**తాడ్వాయి,మహా:** మంగళవారం విడుదల అయిన ఎస్ఎస్ సి ఫలితాలలో ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు సత్తా చాటారు. తాడ్వాయి కి చెందిన కబ్బక చైత్రశ్వి తాడ్వాయి మండల ద్వితీయ స్థానం, మండల తృతీయ స్థానంలో దబగట్ల ప్రవీణ నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి రేవతి ఆధ్వర్యంలో పాఠశాల బృందం విద్యార్థినిలకు అభినందనలు తెలియజేశారు.అంతే కాకుండా 500 మార్కులు పైగా 30 మంది విద్యార్థినులు, 400 పైగా మార్కులు 35 మంది విద్యార్థినులు, 350 మార్కులకు పైగా ఇద్దరు విద్యార్థినులు సత్తా చాటారు.





# సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** పేద బడుగు బలహీన వర్గాల సంక్షేం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను ఆయన బుధవారం తన క్యాంపు కార్యాలయంలో అందించారు. మొత్తం వచ్చిన 14 సీయం ఆర్ ఎఫ్ చెక్కులలో రెండు చెక్కులను ఇక్కడ అందచేసామని మిగతావి వారి నివాసాలకు వెళ్లి అందస్తామని ఆయన తెలిపారు. సీయంఆర్ ఎఫ్ కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమం లో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,ఎం.ఏ షకీల్,ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునిగేల విట్టల్, తాజా మాజీ కౌన్సిలర్లు బండారి సతీష్,యెల్మెల్వార్ రామ్ కుమార్,సంద నర్సింగ్,షేక్ ఇమ్రాన్,జాఫర్ అహ్మద్,తాజా మాజీ మున్సిపల్ కో.ఆప్షన్ మెంబర్ ఇజ్జగిరి సంజయ్ కుమార్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,నాయకులు బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న, సింగిరెడ్డి రామ్ రెడ్డి,దొగ్గలి రాజేశ్వర్,అల్చెట్టి నాగన్న,కొండూరి రవి,మొహమ్మద్ రఫీక్,ఎం.ఏ కయ్యుమ్,నిమ్మల ప్రభాకర్,అశోక్,అతిక్ ఉర్ రహమాన్,అంజద్ ఖాన్, అయాస్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**




**షాద్ నగర్,మహా:** భూభారతి చట్టం పై అవగాహన కార్యక్రమం పేదల పాలిట గొప్ప వరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కొందుర్గ్ లో రైతు వేదిక వద్ద, చౌదర్ గూడెం రైతు వేదిక మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ....భూ వివాదల శాశ్వత పరిష్కారానికి తెచ్చిందే భూ భారతి చట్టం అన్నారు.ప్రతి వ్యక్తికి ఆధార్ లాగా ప్రతి భూమికి భూదారని చెప్పారు.భూమి రికార్డులను మోసపూరితంగా మార్చి ప్రభుత్వ,భూధాన్,అసైన్డ్,దేవాదాయ, భూములను ఎవరైనా పట్టా చేసుకుంటే వాటిని రద్దు చేసేలా సిసిఎల్ఏ కి అధికారాలు ఉంటాయన్నారు. కొత్త చట్టంలో అప్పీలు వ్యవస్థ తెచ్చమని,ఎవరి భూమి అయిన వేరే వాళ్ళకు తప్పుగా నమోదైతే ఎమ్మార్వో, ఆర్డీవో, జేసీ,కలెక్టర్ కు అప్పీలు చేసుకొని పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారులను నియమించడంతో రైతులకు అన్ని సేవలు గ్రామంలోని అందుతాయన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు ప్రజలకు అన్ని సేవలు అందించేలా ఉపయోగపడుతుందన్నారు. ధరణి వల్ల రైతులు భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటికీ రేవంత్ రెడ్డి గారు ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఆర్ఓఆర్ చట్టం భూభారతితో సులభంగా పరిష్కారం అవుతుందన్నారు. ధరణి రిజిస్ట్రేషన్ లో పొరపాటు జరిగిన సరిదిద్దుకునే అవకాశం ఉండేది కాదని రైతులు,పేదలు కోట్ల చుట్టూ తిరగాల్సి వచ్చేదని అన్నారు. ధరణి అన్నదమ్ములు, కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం మొత్తం పారదర్శకంగా ఉంటుందని ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత ,షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్అలీఖాన్,మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి, రాజు ,ఇబ్రహీం,,చంద్రశేఖర్,రాజా రత్నం, గోవర్ధన్ గౌడ్ పురుషోత్తం రెడ్డి, గోపాల్, రాముల గౌడ్ ,యాదయ్య, ఆంజనేయులు, రాజు పాల్గొన్నారు.

### సిఐటియు పోరాట ఫలితమే అంగన్వాడీ కేంద్రాలకు
# మే నెలంతా సెలవులు

**రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు**
**సిఐటియు జిల్లా అధ్యక్షురాలు సంపూర్ణ**



**దోర్నకల్,మహా:** సిఐటీయూ పోరాట ఫలితంగానే అంగన్వాడీ కేంద్రాలకు మే నెల పూర్తిగా సెలవులు వచ్చాయని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు సంపూర్ణ తెలిపారు. ఐసిడిఎస్ డైరెక్టర్ ఆఫీసులో డైరెక్టర్ కాంతివేస్లీ సంబంధిత అధికారులు అంగన్వాడీ యూనియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు యూనియన్ నుండి రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు కే.సమ్మక్క పాల్గొన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు మే నెలంతా సెలవులు ఇస్తున్నామని తెలియజేశారు. ఇతర సేవలు అందించటం కోసం అంగన్వాడి ఉద్యోగులందరూ కృషి చేయాలని అన్నారు. ఈ నిర్ణయం వెలువడిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి సిఐటియు తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.సిఐటియు సంఘం ఆధ్వర్యంలో మే నెలంతా సెలవులు ఇవ్వాలని నిరంతరం అనేక పోరాటాలు నిర్వహించామన్నారు. ఫలితంగానే ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ మీటింగ్ నిర్వహించి మే నెలంతా సెలవులు ఇస్తూ నిర్ణయం చేయాల్సి వచ్చిందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఐసిడిఎస్ 50 సంవత్సరాల చరిత్రలో ఈ ప్రభుత్వం ఆధ్వర్యంలో మే నెలంతా సెలవులు నిర్ణయం చేసినందుకు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో మరిన్ని సమరశీల పోరాటాలకు అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ మినీ టీచర్స్ అందరు సిద్ధం కావాలన్నారు.




## కృష్ణవేణి స్కూల్స్ లో 10వ తరగతి ఫలితాల్లో బాలికల ప్రభంజనం

**వరంగల్, మహా:** బుధవారం విడుదలైన పదవ తరగతి 2025 ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలలో విజయం సాధించిన వరంగల్ నగరంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ దేశాయపేట బ్రాంచ్ లో బాలికలు ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ వట్నాల శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపాల్ కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో బంక వైష్ణవి 568/600, అప్పాని ఐశ్వర్య 565/600, శాయిస్థ సనో బార్ 559/600 అత్యుత్తమ ఫలితాలు సాధించారని మిగతా విద్యార్థులు కూడా ఆశించిన విధంగా మంచి ఫలితాలు సాధించినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ యజమాన్యం శుభాకాంక్షలు తెలిపి మిఠాయి తినిపించి స్కూల్ ఆవరణలో పెద్ద ఎత్తున బాణాసంచ కాల్చారు.



## పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై యూత్ కాంగ్రెస్ నేతల ఆగ్రహం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై యూత్ కాంగ్రెస్ నేతల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల్ని యూత్ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. కడ్తాల్ మండల కేంద్రంలో పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్యాణ్ భాను కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభినవ్ రెడ్డి హాజరయ్యారు. ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్లకు ఘనంగా నివాళులు అర్పిస్తూ, వారికీ సంతాపం తెలియజేశారు. అనంతరం సమావేశంలో మాట్లాడిన నాయకులు... పవన్ కళ్యాణ్ "దక్షిణ భారతదేశంలో ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే కాంగ్రెస్ నేతలు ఉన్నారని" వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిందని, దేశభద్రత కోసం తమ ప్రాణాలను అర్పించిన నాయకులు కాంగ్రెస్‌లో ఉన్నారని వారు పేర్కొన్నారు. దేశభక్తి నిండి ఉన్న పార్టీపై అసత్య ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమైన చర్య అని తెలిపారు. "పాకిస్తాన్ వెళ్లిపోండి" అనే విధంగా కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సర్వసామాజికంగా అభ్యంతరకరమైనవని, వెంటనే ఆ వ్యాఖ్యలను పవన్ కళ్యాణ్ వెనక్కి తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మొహ్మద్ ఇమ్రాన్ బాబా, కడ్తాల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోసు రవి, మండల ప్రధాన కార్యదర్శి కందికంటి రాజేందర్ గౌడ్, జంగం ఆకాష్ గౌడ్, ఎర్రోళ్ల శ్రీకాంత్, సోమరాజు సందీప్, మహేష్, భాస్కర్, సల్మాన్ తదితర యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.*



### మంచాలలో మహాత్మా బసవేశ్వర
## జయంతి వేడుకలు

**ఘన నివాళులు అర్పించిన మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర వీర శైవ లింగాయత్ బలిజ సంఘం మంచాల మండలం నాయకుల ఆహ్వానం మేరకు మహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి హాజరయ్యారు. మీ సందర్భంగా మహాత్మా బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, అశ్వాల బాలరాజు, వీర శైవ లింగాయత్ బలిజ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పలువురు పాల్గొన్నారు.

### అనుమతులు లేని జూనియర్ కళాశాలలను
# వెంటనే సీజ్ చేయాలి

**డిఐఈఓ గోపాల్ కు వినతిపత్రం అందజేసిన ఎల్తూరి సాయికుమార్**
**స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు**




**హన్మకొండ, మహా:** ప్రభుత్వ అనుమతులు లేని కాలేజీలను వెంటనే సీజ్ చేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిఐఈఓ గోపాల్ కు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ హనుమకొండ నగరంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా జూనియర్ కళాశాలను నడిపిస్తున్న చైర్మన్ ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను ఇటు ప్రభుత్వాన్ని కూడా మోసం చేస్తూ విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ ,కనీస మౌలిక సదుపాయాలు లేకుండా కాలేజ్ స్ట్రక్చర్ లేకుండా నడిపించడమే కాకుండా జేఈఈ,మెయిన్స్ పేరిట లక్షల రూపాయలు విద్యార్థుల నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్న కళాశాలల చైర్మన్లు, పర్మిషన్ ఉన్న బ్రాంచ్ వద్ద అడ్మిషన్ చేర్చుకొని అక్కడ క్లాసులు చెప్పకుండా విచ్చలవిడిగా అద్దె భవనాలు తీసుకొని అక్కడ కళాశాలలను నడిపించడం జరుగుతుందని ప్రమాదవశాత్తు అక్కడ ఏదైనా జరగరానిది జరిగితే విద్యార్థుల బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఇందుకు స్థానిక డిస్టిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డి ఐ ఈవో) స్పందించి తక్షణమే అనుమతులు లేని కాలేజీలను మూసివేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చెట్టుపల్లి శివకుమార్, సిద్ధార్థ , విక్రం, సాత్విక్ ,శ్రావణ్, జస్వంత్ ,సాయి , ముఖేష్ గణేష్, తదితరులు పాల్గొన్నారు



## అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించిన రెవెన్యూ అధికారులు

**రాజేంద్రనగర్ మహా:** అనుమతులు లేని అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించిన రెవెన్యూ అధికారులు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధి బుద్వేల్ లోని మానసహిల్స్ లో అక్రమ నిర్మాణాలను ఎమ్మార్వో రాములు ఆదేశాలతో బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

## అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బసవేశ్వరుడు

- చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు
- జిల్లా డిఆర్ఓ సంగీత, బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సమాజం అభివృద్ధికి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులు మహాత్మ బసవేశ్వరుడు అని డిఆర్ఓ సంగీత అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాత్మా బసవేశ్వర 892 జయంతి వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా డిఆర్ఓ సంగీత, బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్, ఏవో సునిల్ కుమార్ కలిసి ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డి అర్ ఓ సంగీత మాట్లాడుతూ... మూఢనమ్మకాల పైన నిరంతరం పోరాటం చేసిన మహానుభావుడు బసవేశ్వరుడు అన్నారు. ప్ర ప్రథమ సంఘసంస్కర్త సమతవాది అని అన్నారు. అణగారిన వారి వర్గాల పట్ల ఆశావాది నిరంతర మార్గదర్శకుడని, బసవేశ్వరుని యొక్క మార్గాన్ని ముందుకు సాగాలని, సమాజ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. జయతి కార్యక్రమంలో బి సి వెల్ఫేర్ అధికారులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.